


# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 24 మార్చి 2022 సంపుటి: 03 సంచిక: 194 పేజీలు: 4 వెల: రూ 3-00


## దిశ పెట్రోలింగ్ వెహికల్స్ను ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్



3 వేలకు పైగా ఎమర్జెన్సీ వాహనాలను ప్రారంభిస్తున్నామని సీఎం జగన్ అన్నారుఅందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే అన్ని పోలీస్ స్టేషన్లకు 900 ద్విచక్ర వాహనాలు (స్కూటర్లు) మహిళల రక్షణ కోసం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ గొప్ప సంకల్పంతో ముందుకు సాగుతున్న పోలీస్ శాఖ 163 ఫోర్ వీలర్ వాహనాలను కొనుగోలు చేసి పంపిణీకి సిద్ధం చేసింది. ఈ వాహనాలన్ని జిల్లా యూనిట్ కంట్రోల్ రూం నుండి నేరుగా ప్రత్యక్ష పర్యవేక్షణకు అనుగుణంగా

అమరావతి మహిళల భద్రతకోసం ఏర్పాటు చేసిన దిశ పెట్రోలింగ్ వెహికల్స్ ను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి బుధవారం ఉదయం ప్రారంభించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు మరింత చేరువ కావడానికి మరియు మహిళలకు పటిష్టమైన భద్రతను కల్పించడంలో భాగంగా క్షేత్ర స్థాయిలో నేరాలను అరికట్టడం కోసం విజిబుల్ పోలీసింగ్ను మెరుగుపరచడం కోసం ఆంధ్ర ప్రదేశ్ పోలీస్ శాఖ దిశ పెట్రోలింగ్ ను ప్రారంభించింది. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ.. మంచి కార్యక్రమానికి ఈ రోజు శ్రీకారం చుడుతున్నాం. 1.16 కోట్ల మంది అక్కాచెల్లెమ్మలు దిశ యాప్ డౌన్లోడ్ చేసుకున్నారు. మహిళలపై అన్యాయం జరిగితే ప్రభుత్వం ఊరుకోదు. ఇప్పటికే దిశ పోలీస్స్టేషన్లలో 900 ద్విచక్రవాహనాలున్నాయి. వీటితో పాటు




ప్రత్యేక జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థతో కూడి ఉంటుంది. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలను అరికట్టడానికి ఈ పెట్రోలింగ్ వాహనాలు జనసంచారం తక్కువ ఉన్న సమస్యాత్మక ప్రాంతాలలో నేరం జరిగేందుకు అవకాశం ఉన్న అన్ని ప్రదేశాలలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తాయి.మహిళలు తమ మొబైల్ ఫోన్ లో దిశ అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకున్నా అనంతరం ఏదైనా సమస్యను ఉత్పన్నమైనప్పుడు తమ చేతిలోని ఎూూ లేదా మొబైల్ ను షేక్ చేయడం ద్వారా భాదితుల వద్దకు చేరుకునే పోలీసులు సమయం పట్టణ ప్రాంతాల్లో ప్రతిస్పందన సమయం 4-5 నిమిషాలు అదే గ్రామీణ ప్రాంతాల్లో 8-10 నిమిషాలకు తగ్గింది. ఈ ప్రతిస్పందన సమయం మరింత తక్కువగా ఉండడానికి ఈ ప్రత్యేక వాహనాలు తోడ్పడతాయి. ఇప్పటికే దిశ మొబైల్ అప్లికేషన్ ను కోటి పదహారు లక్షల మంది మహిళలు తమ మొబైల్ ఫోన్ లలో డౌన్ లోడ్ చేసుకున్నారని అధికారులు వెల్లడించారు. .

## చంద్రన్న కానుకలే ఈ చీప్ లిక్కర్ బ్రాండ్లు.. మేం అనుమతులు ఇచ్చింది లేదు: సీఎం వైఎస్ జగన్



అమరావతి: చంద్రబాబు ఇంటి పేరు నారా బదులు సారా అని పెడితే బాగుంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. బుధవారం మద్యం పాలసీపై అసెంబ్లీ సమావేశాల్లో స్వల్పకాలిక చర్చ సందర్భంగా.. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రస్తుత ప్రభుత్వానికి రుద్దే ప్రయత్నం జరుగుతోందని సీఎం జగన్ వివరించారు. రాష్ట్రంలో 20 డిస్టిలరీలకుగానూ 14 డిస్టిలరీలకు అనుమతి ఇచ్చిన పాపం చంద్రబాబుదేనని, 2019 తర్వాత ఒక్క డిస్టిలరీకి గానీ, ఒక్క బ్రూవరీకిగాని తమ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని సీఎం జగన్ గుర్తు చేశారు. “నవరత్నాలు, అమ్మ ఒడి.. ఇవీ మా ప్రభుత్వ బ్రాండ్లు. ప్రెసిడెంట్ మెడల్, గవర్నర్ ఛాయిస్ భూంభూం బీర్, పవర్ స్టార్ 999, 999 లెజెండ్.. బ్రాండ్లన్నీ చంద్రన్న కానుకలే. ఇవన్నీ చంద్రబాబు ఆశీస్సులతో వచ్చిన బ్రాండ్లే. ప్రెసిడెంట్ మెడల్ బ్రాండ్.. చంద్రబాబు మెడల్ బ్రాండ్. గవర్నర్ ఛాయిస్ 2018, నవంబర్ 5న అనుమతి ఇచ్చింది చంద్రబాబే. ఆయన దిగిపోయే చివరి క్షణం వరకు లిక్కర్ బ్రాండ్లకు అనుమతులు ఇస్తూనే ఉన్నారు. చంద్రబాబు హయాంలోనే 254 బ్రాండ్లు వచ్చాయి. ఇవన్నీ ఆయన ట్రేడ్ మార్క్ బ్రాండ్లు. కానీ, ఈ బ్రాండ్లను మేం క్రియేట్ చేసినట్లుగా ప్రచారం చేస్తున్నారు. స్పెషల్ స్టేటస్, త్రీ క్యాపిటల్ అంటూ తప్పుడు లేబుల్స్తో ప్రచారం చేసిన ఘనత కూడా టీడీపీ నేతలదేనని సీఎం జగన్ అన్నారు. “2019 తర్వాత మా ప్రభుత్వం ఒక్క బ్రాండ్కు కూడా అనుమతి ఇవ్వలేదు. మేం అమ్మే బ్రాండ్లన్నీ లైసెన్స్ డిస్టిలరీస్ నుంచి వచ్చినవే. మనిషి పరంగా చంద్రబాబు, పార్టీపరంగా టీడీపీ , మరో వైపు ఎల్లో మీడియా ఇవే అసలు సిసలైన చీప్ బ్రాండ్స్. ఏ షాపు నుంచి తీసుకొచ్చారో ఆధారాలు లేకుండా శాంపిల్స్ టెస్టింగ్కు ఇచ్చారు. ఇక్కడ శాంపిల్స్లో ట్యాంపరింగ్ కూడా చేసి ఉండొచ్చు కదా. వారు ఇచ్చిన లైసెన్స్డ్ డిస్టిలరీస్ నుంచే మద్యం విక్రయిస్తున్నాం. అప్పుడు అది విషంగా ఎలా మారుతుంది?” అని ప్రశ్నించారు సీఎం జగన్. మా ప్రభుత్వం 16 మెడికల్ కాలేజీలకు అనుమతిస్తే.. డిస్టిలరీలకు అనుమతి ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని, జంగారెడ్డిగూడెం మరణాలపై టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని, సహజ మరణాలను కల్తీ సారా మరణాలుగా చంద్రబాబు చిత్రీకరిస్తున్నారంటూ సీఎం జగన్ ఆక్షేపించారు. టీడీపీ నేతలవి క్రిమినల్ బ్రెయిన్స్ అని, వాళ్లందరినీ జూలో పెట్టడమే కరెక్ట్ అంటూ సీఎం జగన్ చమత్కరించారు.




## ఆ నీచ ఘనత చంద్రబాబు నాయుడిదే: కొడాలి నాని

అమరావతి: ఆంధ్రప్రదేశ్లో 240 మద్యం బ్రాండ్లకు పర్మిషన్లు ఇచ్చిన నీచ ఘనత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుది అని మంత్రి కొడాలి నాని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. చీప్ లిక్కర్ను భారతదేశంలో కనిపెట్టిన చీప్ ముఖ్యమంత్రి చంద్రబాబు అని మండిపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తే చంద్రబాబు అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే మళ్లీ లిక్కర్ను రాష్ట్రంలో ప్రవేశ పెట్టిన 420 చంద్రబాబు నాయుడని విమర్శించారు. అదే వైఎస్ జగన్మోహన్రెడ్డి సీఎం అయ్యాక 45వేల బెల్ట్ షాప్లను రద్దు చేసినట్లు తెలిపారు. అదే విధంగా బడులు, దేవాలయాల వద్ద ఉన్న వైన్స్ షాపులను తీసేయించిన ఘనత సీఎం జగన్ది అని కొనియాడారు. చంద్రబాబు అల్జీమర్స్తో బాధపడుతున్నారని చంద్రబాబు రాష్ట్రాన్ని పాలించడం మన దురదృష్టకరమని విమర్శించారు. టీడీపీని ఎవరు పట్టుకుంటే వారు సర్వనాశనం అవుతారన్నారు?. తెలంగాణలో టీడీపీకి ఏ గతి పట్టిందో ఏపీలో అదే గతి పడుతుందని మంత్రి కొడాలి నాని విమర్శించారు. టీడీపీ నాయకులు పార్టీ మారాలని, లేదా తమ నాయకుడిని అయినా మార్చుకోవాలని హితవు పలికారు.




## ఒక్కరోజు సభా నిర్వహణకు ఎంత ఖర్చవుతుందో తెలుసా?..

అమరావతి: ఏపీ అసెంబ్లీ నుంచి టీడీపీ ఎమ్మెల్యేలు మరోసారి సస్పెన్షన్ గురయ్యారు. రెండు రోజుల పాటు టీడీపీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రకటించారు. అసెంబ్లీలో టీడీపీ సభ్యులు చిడతలు వాయిస్తూ సభా కార్యకలాపాలకు పదేపదే ఆటంకం కలిగించడంతో స్పీకర్ ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్యేల తీరును స్పీకర్ తప్పుపట్టారు. ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారంటూ టీడీపీ సభ్యులపై స్పీకర్ తమ్మినేని సీరియస్ అయ్యారు.ఒక రోజు శాసనసభ నిర్వహణకు రూ.53.28లక్షలు ఖర్చవుతుంది. ఒక నిమిషం సభ నిర్వహణకు రూ. 88,802 ప్రజాధనం ఖర?చవుతుంది. ప్రభుత్వం ప్రజా సమస్యల్ని చర్చించడానికి ఇంత ఖర్చుపెడుతుంటే టీడీపీ సభ్యులు సభా సమయాన్ని ఇలా నిరుపయోగం చేయడం ఏంటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.




## ప్రెసిడెంట్ బ్రాండ్ అనేది టీడీపీ మెడల్: ఎమ్మెల్యే పార్థసారథి

అమరావతి: రాష్ట్రంలో మద్యాపాన నిషేధాన్ని ఎత్తేసేందుకు చంద్రబాబు ముడుపులు తీసుకున్నారని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. మద్యం పాలసీపై స్వల?పకాలిక చర్చలో ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. మద్యాపాన నిషేధాన్ని ఎత్తేసిన వ్యక్తి చంద్రబాబు



అని తెలిపారు. ప్రభుత్వానికి ఆదాయం తగ్గిపోతోందని ఆనాడు చంద్రబాబు మద్యానికి తలుపులు తెరిచారని అన్నారు.డిస్టిలరీస్ నుంచి రూ.వేల కోట్లు వసూలు చేశారని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ప్రెసిడెంట్ బ్రాండ్ అనేది టీడీపీ మెడల్ అని ఎద్దేవా చేశారు. ప్రెసిడెంట్ బ్రాండ్ అనేదానికి చంద్రబాబే పర్మిషన్ ఇచ్చారని అన్నారు. ఊరూరా మద్యాన్ని ఏరులై పారించిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు.

## శ్రీవారి ఆలయంతో విశాఖ సర్వతోముఖాభివృద్ధి

- శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి
కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు శ్రీవారి ఆలయాలు
- టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి
విశాఖకు మరింత ఆధ్యాత్మిక శోభ
- మంత్రి అవంతి శ్రీనివాస్



విశాఖ విశాఖలో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో బుధవారం శాస్త్రోక్తంగా మహాకుంభాభిషేకం జరిగింది. ఈ కార్యక్రమంలో విశాఖ శారద పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి అనుగ్రహభాషణం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి కోరిక మేరకు, టిటిడి ఛైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం విశాఖలో నిర్మించినట్లు తెలిపారు. వైఖానస ఆగమానుసారం శ్రీవారి ఆలయ నిర్మాణం జరిగిందన్నారు. ఆలయంలో మూలమూర్తి సాక్షాత్తు తిరుమల వెంకన్న తిరిగి వచ్చాడా అన్నంత అద్భుతంగా ఉందన్నారు. వేదాలు ఆగమాలు దేవాలయాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాయని చెప్పారు. ధ్వజస్తంభం సమస్త జీవులకు, ఆలయానికి వెన్నుముక్క వంటిదన్నారు. ముఖమండపం స్థూలశరీరం, అర్ధ మండపం సూక్ష్మ శరీరం, గర్భాలయం హృదయం వంటిదన్నారు. గర్భాలయంలోని స్వామివారిని దర్శిస్తే సమస్త పాపాలు తొలగి, కోరిన కోర్కెలు నెరవేరుతాయని వివరించారు.విశాఖ శారదా పీఠం లోకంలోని సమస్త జీవులు సుభిక్షంగా ఉండాలని, సనాతన హైందవ ధర్మ పరిరక్షణకు పనిచేస్తోందన్నారు. శ్రీ వారి అనుగ్రహంతో రాష్ట్రం బాగుండాలని, ప్రత్యేకంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో పిల్లలకు విద్యాబుద్ధులు, పెద్ద పరిశ్రమలు రావడం ద్వారా యువత ఉపాధి అవకాశాలతో ఎదగాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం టిటిడి ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ, విశాఖకు మరింత ఆధ్యాత్మిక శోభ కల్పించేందుకు రెండు సంవత్సరాల క్రితం రూ.26 కోట్లతో శ్రీవారి ఆలయ నిర్మాణం చేపట్టామన్నారు. మార్చి 18వ తేదీన అంకురార్పణతో ప్రారంభించి ఐదు రోజుల పాటు ఋత్వికులు వైదిక కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. సనాతన హైందవ ధర్మ ప్రచారంలో భాగంగా కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు శ్రీవారి ఆలయాలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఒరిస్సాలో శ్రీవారి ఆలయం పూర్తయిందని, రాబోయే రెండు నెలల్లో ఆలయం ప్రారంభిస్తామన్నారు. అమరావతిలో కూడా శ్రీవారి ఆలయం పూర్తిచేసి త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. కాశ్మీర్లో 60 ఎకరాల విస్తీర్ణంలో శ్రీవారి ఆలయ నిర్మాణం జరుగుతోందని, ఆరు నెలల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా గిరిజన, మత్స్యకార, బడుగు బలహీనవర్గాల ప్రాంతాలలో రాబోయే రెండేళ్ళలో 1000 శ్రీవారి ఆలయాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. రాష్ట్ర మంత్రి అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈరోజు విశాఖ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించవలసిన రోజన్నారు. తిరుమల నుండి స్వామివారు మనందరినీ ఆశీర్వదించడానికి ఇక్కడికి వచ్చారన్నారు. విష్ణుమూర్తికి సముద్రం అంటే ఇష్టమని, విశాఖ సముద్రతీరంలో శ్రీవారి ఆలయ నిర్మాణం అద్భుతంగా ఉందన్నారు. శ్రీ వారి అనుగ్రహంతో విశాఖ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.




# సంపాదకీయం

గురువారం 24 మార్చి 2022

## యుద్ధం ఆగేదెన్నడు?

ఉక్రెయిన్ యుద్ధం రోజులకు రోజులుగా సాగుతుండటం రష్యా అధ్యక్షుడు వ్లాడిమిర్ పుతిన్ ఆలోచనలపై తీవ్ర ప్రభావం చూపుతోందా? ఆయన అనుకున్నది ఒకటైతే జరుగుతోంది మరొకటా? రష్యా సైన్యం ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయిన భావవనలో ప్రస్తుతం పుతిన్ ఉన్నారు. సంవత్సరాలుగా ఆయన మనసెరిగిన పశ్చిమ దేశాల గూఢచార వర్గాలు ఈ అంచనాకు వచ్చారు. పుతిన్ ఇకముందు ఎలాంటి చర్యలకు దిగుతాడో అర్థంకాక ఆందోళన చెందుతున్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధం సాగుతున్న తీరు పుతిన్‌ను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తోంది. ఆయన ఆరోగ్యంపైనా అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సంక్షోభ సమయంలో పుతిన్ పూర్తిగా ఒంటరితనం కోరుకుంటున్నారనే విశ్లేషణలు కూడా ఉన్నాయి. వాస్తవానికి ఉక్రెయిన్‌పై సైనిక చర్యకు రూపకల్పన చేసింది సైనికాధికారులు కాదట. కేజీబీ అధికారి ఒకరు దానిని రూపొందించారని నిఘా సంస్థలు అంటున్నాయి. నిజానికి ఉక్రెయిన్‌పై దాడి రష్యా మిలిటరీ కమాండర్లకు ఇష్టం లేదని, ఏం జరుగుతుందో అర్థంకాని స్థితిలో సైనికులు సరిహద్దులకు వెళ్లారని అంటున్నారు. నిజానికి, రష్యా సైనిక దాడిపై, సైనిక ప్రణాళికలపై అక్కడి నేతల కన్నా పశ్చిమ దేశాల ఏజెంట్ల దగ్గరే ఎక్కువ సమాచారం ఉంది. కానీ పుతిన్ తరువాత అడుగు ఎటు వేస్తారనేది వారికి కూడా తెలియదు. పుతిన్ ఏం చేయబోతున్నాడో తెలుసుకోవటం దాదాపు అసంభవం. ఎందుకంటే ఆయన దగ్గర సమిష్టి నిర్ణయాలకు స్థానం లేదు. ఏ నిర్ణయం తీసుకున్నా ఒక్కడే తీసుకుంటాడు. పుతిన్ తరచూ బహిరంగ ప్రకటనలు చేస్తుంటారు. వాటి ద్వారా ఆయన ఉద్దేశాలపై కొంత అవగాహన కలిగే వీలుంది. కానీ అతడు ఎప్పుడు ఎలా స్పందిస్తాడో నిఘా వర్గాలకు కూడా అంతుబట్టదు. పుతిన్ ఆలోచనలు ఎలా ఉంటాయో రష్యా ప్రజలకు కూడా అర్థం కాదు. ఇక మిగతా వారి సంగతి సరే సరి. పుతిన్ కేవలం కొందరి మాటలు మాత్రమే వింటాడు. చాలా తక్కువ మందితో మాట్లాడుతాడు. ఉక్రెయిన్‌పై సైనిక చర్య విషయంలో కూడా ఇదే జరిగిందని అమెరికా నిఘా అధికారులు నమ్ముతున్నారు. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం సమయంలో రష్యాకు ఎదురైన అవమానానికి బదులు తీర్చుకోవాలనే కోరిక పుతిన్‌లో బలంగా ఉంది. రష్యాను అణచివేసి తనను అధికారానికి దూరం చేయాలని పశ్చిమ దేశాలు చూస్తున్నాయని పుతిన్ బలంగా నమ్ముతాడు. అయితే.. ఎలాంటి ఆధారాలు లేకుండా కొందరు ఆయన అనారోగ్యం బారిన పడ్డారని ప్రచారం చేస్తున్నారు. ఆయన మానసిక పరిస్థితి గురించి ఎక్కువగా చర్చిస్తున్నారు. కరోనా సమయంలో పుతిన్ పూర్తిగా ఐసోలేషన్‌లోకి వెళ్లిపోయారు. అది ఆయన మానసిక పరిస్థితిపై ప్రభావం చూపే అవకాశం కొంతవరకు ఉంటే ఉండవచ్చు. కానీ రుగ్మత స్థాయిలో కాదు. మరోవైపు ప్రస్తుత యుద్ధంలో వాస్తవంగా ఏం జరుగుతుందనే దాని మీద పుతిన్‌కు ఖచ్చితమైన సమాచారం లేదనే వాదన వినిపిస్తోంది. ఆయనకు భయపడి నిఘా సంస్థలు వాస్తవ సమాచారాన్ని దాస్తున్నారని అంటున్నారనే కథనాలు వెలువడుతున్నాయి. అందుకే ఇప్పుడు ఆయన తనకు తాను ఓ చీకటి గదిలో ఉన్న భావనలో ఉన్నారు. తాను బలహీనపడినట్టు భావిస్తే మరింత ప్రమాదకరంగా మారే ప్రమాదం ఉంది. కనుక ముందు పశ్చిమ దేశాలు రెచ్చగొట్టే చర్యలు ఆపి సంక్షోభం పరిష్కారానికి వేగంగా అడుగులు వేయటం ముఖ్యం.

## అమాత్య యోగం ఉందా...

తిరుపతి, మార్చి 23, (న్యూస్ పల్స్)అధికారపార్టీ వైసీపీలో ఫైర్‌బ్రాండ్ ఎమ్మెల్యే రోజా. చిత్తూరు జిల్లా నగరి నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. శాసనసభ్యురాలిగా మొదటి టర్మ్ విపక్షంలోనే గడిచిపోయింది. గత ఎన్నికలలో వైసీపీ పవర్‌లోకి రావడంతో అధికారపక్షంలో ఉన్నారు. రోజా ది ఫైర్‌బ్రాండ్ అనే ట్యాగ్ లైన్ చూసి తప్పకుండా కేబినెట్‌లోకి తీసుకుంటారని 2019లోనే ఆశించారు. సామాజిక, జిల్లా రాజకీయ సమీకరణాల వల్లో ఏమో మంత్రివర్గంలో చోటు దక్కలేదు. రెండున్నరేళ్ల తర్వాత కేబినెట్ ప్రక్షాళన ఉంటుందని సీఎం జగన్ చెప్పడంతో ఆ మాట పట్టుకుని ఎదురు చూస్తూ ఉన్నారు. ఇప్పుడు సీఎం జగన్ ఆ దిశగా కసరత్తు ఉంటుందని స్పష్టం చేయడంతో రోజా ఆశలు రెట్టింపు అయ్యాయట. మంత్రి కావాలన్నది రోజా బలమైన ఆశగా చెబుతారు ఆమె సన్నిహితులు. అది దక్కకపోవడం వల్లే అప్పట్లో ఫైర్ తగ్గింది. తర్వాత సర్దుకుని గాడిలో పడ్డారు. ంఖఎఎఅ ఛైర్‌పర్సన్ పదవి వరించింది. గడువు తీరడంతో ఆ పదవిలోకీ ఇంకొకరు వచ్చేశారు. ప్రస్తుతం ఎమ్మెల్యే తప్ప చేతిలో ఇంకే పదవీ లేదు. కేబినెట్‌లోకి తీసుకొనే ఆలోచన ఉండటం వల్లే మరో నామినేటెడ్ పదవి ఇవ్వలేదన్నది రోజా అనుచరుల మాట. ఈ సందర్భంగా అధిష్ఠానం ఆశీసులు దక్కాలని మునుపటిలా టీడీపీపై విరుచుకుపడుతున్నారు రోజా. దైవబలం కూడా ఉండాలని రోజా తిరగని గుడి లేదు.. మొక్కని దేవుడూ లేడు. నగరి ఎమ్మెల్యే రోజాకు దైవభక్తి ఎక్కువే. తరచూ తిరుమల వెళ్తారు. ఈ మధ్య కాలంలో తిరుమల మరిన్ని ఎక్కువసార్లు వెళ్తూ? మనసులో కోరికను స్వామివారికి నివేదిస్తున్నారట. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలన్నింటినీ చుట్టేశారు రోజా. ఒక్క గుళ్లే కాదు.. మారుమూల గ్రామాల్లో కొందరికి అమ్మవారు ఆవహిస్తారని.. ఆ సమయంలో ఆశీసులు తీసుకుంటే మేలు జరుగుతుందని తెలిస్తే అక్కడికి వెళ్లిపోతున్నారు. అలా విజయనగరం జిల్లా మక్కువ మండలం పాపయ్యవలస గ్రామంలోనూ తళుక్కుమన్నారు. అక్కడ దుర్గమ్మను దర్శించుకుని అంబ పలికేతే చాలు.. అధిష్ఠానం ఆశీసులు అందితే చాలన్నట్టుగా పూజలు నిర్వహించారు రోజా. ఇటీవల హైదరాబాద్ ముచ్చింతల్‌లో సమతామూర్తి విగ్రహావిష్కరణలో పాల్గొని ఆధ్యాత్మిక తన్మయత్వంలో మునిగి తేలారు ఎమ్మెల్యే రోజాఏదో ఒక దేవుడు లేక దేవత తన మొర ఆలకించక పోతారా.. ఆశ నెరవేరకపోతుందా అని భావించి తెలంగాణలోని మరో పుణ్యక్షేత్రం యాదాద్రిలోనూ ప్రత్యక్షం అయ్యారు రోజా. ఇటీవలే తూర్పుగోదావరిలోని పంచారామ క్షేత్రాలను దర్శించి.. భోళాశంకరుడికి తన కోరికను నివేదించి వచ్చారు రోజా. సామర్లకోట, ద్రాక్షారామాల్లో పూజలు చేశారు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలోని త్రిపురాంకేశ్వర స్వామి, త్రిపుర సుందరీ సన్నిధిలో కనిపించారు రోజా. కేబినెట్‌లో చోటు దక్కితే అదే పదివేలన్నట్టుగా ఆదిదంపతులకు ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో లోటు లేదు.. భక్తిలో తగ్గేదే లేదన్నట్టుగా రోజా ఆలయాల యాత్ర సాగుతోంది. కేబినెట్ ప్రక్షాళన గడువు సమీపించేలోపు మేడమ్ జాబితాలో మరిన్ని ఆలయాలు చేరే అవకాశం లేకపోలేదు. మరి.. అధిష్ఠానం ఆశీసులు లభించేలా ఏ దేవీదేవతలు రోజాను కరుణిస్తారో చూడాలి.

## వివాదమవుతున్న జప్తు పథకం

కాకినాడ, మార్చి 23,పన్నులు కట్టకపోతే.. ఆస్తులు జప్తు చేసే విధానం ఇవాళ కొత్తగా వచ్చిందా?'.. ఇదీ ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్య. ఈ వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు వ్యక్తం అవుతున్నాయి. కరెంట్ కట్టకపోతే ఫ్యూజులు తీసేస్తామనడం తప్పు అంటే ఎలా? పన్నులు కట్టకపోతే ఆస్తులు జప్తు చేస్తామని చెప్పటం తప్పు అంటే ఎలా అనేది ఆయన ప్రశ్న. గత ప్రభుత్వాలు ఆస్తులు జప్తు చేసినప్పుడు ఎందుకు ప్రశ్నించలేదు? అనేది బొత్స తీసిన లాజిక్. ఆస్తి పన్ను వసూలు కోసం ఓ మున్సిపల్ కార్పొరేషన్ బ్యానర్ ఏర్పాటు చేయడం, సామాన్లు జప్తు చేస్తామని ఆ బ్యానర్ ద్వారా బెదిరింపులకు దిగడంలో తప్పేమీ మంత్రి బొత్సకు కనిపించలేదంటున్నారు. నవరత్నాలు అమలు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి సర్కార్ కొత్తగా పదో రత్నం.. 'జప్తు పథకం' తీసుకొచ్చినట్లు ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నవరత్నాల్లో పథకా అమలు ఎలా ఉన్నప్పటికీ జగనన్న జప్తు పథకాన్ని మాత్రం ఠంచన్ గా అమలు చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి దాకా ఆస్తి పన్ను, ఆదాయపు పన్ను, వృత్తి పన్ను, అమ్మకపు పన్ను లాంటి ట్యాక్సుల్ని మనం కడుతూనే ఉన్నాం. అయితే.. అసలే ఖజానాలో కాసుల కొరతను కొని తెచ్చిపెట్టిన జగన్ రెడ్డి సర్కార్ కు కొత్తగా చెత్త పన్ను వసూలు చేయడానికి అడ్డగోలు పనులు చేయడం మొదలుపెట్టింది. చెత్త పన్ను కట్టలేదని కర్నూలులోని కొండారెడ్డి బురుజు సమీపంలోని దుకాణాల ముందు మున్సిపల్ అధికారులు చెత్త గుమ్మరించడం విమర్శలకు దారితీసింది. అలాగే పన్ను బకాయిలు చెల్లించని వారి సామాన్లు జప్తు చేస్తామంటూ తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో ఫ్లెక్సీలు కట్టడంపై వివాదంరాజుకుంది. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో ఇంటిపన్ను, కుళాయి పన్ను, జగన్ రెడ్డి సర్కార్ కొత్తగా తెచ్చిన చెత్త పన్ను చెల్లించలేదని మున్సిపల్ అధికారులు రెండు ఇళ్లకు సీళ్లు వేయడం కూడా వివాదాస్పదం అయింది. పన్నులు కట్టాలంటూ మున్సిపల్ అధికారులు కాల్ మనీ వడ్డీ వ్యాపారుల మాదిరిగా పీడించుకు తింటున్నారంటూ పలువురు ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారుల తీరుతో స్థానికులు తీవ్ర ప్రతిఘటించడం, ఆందోళనలకు దిగుతున్న సంఘటనలు జరుగుతుండడం విశేషం. నిజానికి ప్రతి పౌరుడూ ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో ఏదో విధంగా ఏదో రకంగా పన్ను కడుతూనే ఉంటాడు. ఇంటి అవసరాలకు కొనుక్కునే వస్తువుల నుంచి రెస్టారెంట్ లో భోజనం చేయడం దాకా ప్రజలు పరోక్షంగా పన్నులు కడుతూనే ఉంటారు. ఆదాయపు పన్ను, ఆస్తిపన్ను లాంటి ప్రత్యక్ష పన్నులు కావచ్చు, స్థానిక ప్రభుత్వాలు విధించే పన్నుల్ని కూడా పౌరులు కడుతూనే ఉంటారు. అయినప్పటికీ మార్చి నెలాఖరు ఆర్థిక సంవత్సరం ముగింపు తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో అధికారులు పన్నుల వసూలును ముమ్మరం చేశారు. ఎక్కడికక్కడ అధికారులు పన్ను వసూళ్లలో వేగం పెంచారు. బకాయి పడిని పలువురి నుంచి ముక్కు పిండి మరీ పన్నులు వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆస్తులను జప్తు చేయడం, సముదాయాల ముందు చెత్తను గుట్టలు గుట్టలుగా పోయడం, ఫ్లెక్సీలు కట్టి బెదిరింపులకు పాల్పడడం, మరీ ముఖ్యంగా పన్ను కట్టని వారి ఇంట్లోని సామాన్లు జప్తు చేస్తామంటూ అధికారులు ఏకంగా ట్రాక్టర్లు, వాహనాలతో సహా తిరగంపై ప్రజలు, ప్రతిపక్ష పార్టీల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పన్నుల వసూలు పేరుతో జగన్ రెడ్డి సర్కార్ ప్రజలను పీక్కుతినే విధంగా వ్యవహరిస్తోందని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ నిప్పులు చెరగడం ప్రస్తావించదగిన అంశం. పన్నులు కట్టకపోతే.. ఇంట్లో మహిళలు ఉండగానే ఇంటికి సీలు వేసి మరీ పన్ను కట్టాలని హెచ్చరించడం ఏమిటని నిలదీశారు. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో అధికారులు ఇంట్లో మహిళలు ఉండగానే తలుపులు, గేట్లకు సీళ్లు వేయడం గమనార్హం. ప్రజల ఆత్మగౌరవాన్ని జగన్ రెడ్డి అహంకారంతో దెబ్బ తీస్తున్నారని విమర్శించారు. ఇళ్లకు తాళాలు వేయడం, కుళాయిలకు బిరడాలు కొట్టడం, దుకాణాల ముందు చెత్త వేయడం లాంటి సంఘటనలు పాలకుల వికృత మనస్తత్వానికి దర్పణం పడుతున్నాయని మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం. 'సంక్షేమ పథకాల పేరుతో డబ్బులు పడేస్తున్నాం కదా.. ప్రజలు మా దగ్గ పడి ఉండాల్సిందే' అనే నియంతృత్వ ధోరణి వైసీపీ ప్రభుత్వంలో కనిపిస్తోందన్న నాదెండ్ల వ్యాఖ్య వాస్తవమే అనిపిస్తోందంటున్నారు పలువురు.

## అగ్రిగోల్డ్ సంగతి ఎక్కడ...

విజయవాడ, మార్చి 23,అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటానని హామీ ఇచ్చిన సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, తాజా బడ్జెట్‌లో ఇందుకోసం నయాపైసా కేటాయించలేదు. గతేడాది బడ్జెట్‌లో రూ.200 కోట్లను కేటాయించినా, అందులో ఎంత ఖర్చు చేశారో స్పష్టం చేయలేదు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2022-23 బడ్జెట్‌లో బాధితులకు ఆర్థిక సహాయం అందించేందుకు ఎలాంటి నిధులను కేటాయించలేదు. దీంతో అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునే చర్యలను ప్రభుత్వం నిలిపివేసిందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అగ్రిగోల్డ్‌లో రాష్ట్రానికి చెందిన 19.52 లక్షల మంది డిపాజిట్‌లు, పెట్టుబడులు పెట్టగా, దేశంలోని ఏడు రాష్ట్రాలలో 32 లక్షల మంది బాధితులు ఉన్నారు. రాష్ట్రానికి చెందిన బాధితులకు న్యాయం చేస్తామని గత టిడిపి ప్రభుత్వం, ప్రస్తుత వైసిపి సర్కార్ ఇచ్చిన హామీలు ఏడేళ్లైనా నెరవేరలేదు. అయినప్పటికీ బాధితులు న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారు. బాధితులకు రూ.3,964 కోట్లను చెల్లించాలని క్రైమ్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (సిఐడి) తేల్చింది. అగ్రిగోల్డ్ సంస్థ 2015 జనవరిలో బోర్డు తిప్పేయడంతో డిపాజిట్‌దారులు, ఏజెంట్లు గుండెపోటుతో ఇప్పటి వరకు 300 మందిపైనే మృతి చెందారు. వారిలో 144 మందికి గత ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించగా, రూ.10 లక్షలు ఇస్తామన్న సిఎం వైఎస్ జగన్ నేటి వరకు ఒక్క పైసా ఇవ్వలేదు. మొత్తం బాధితులలో రూ.20 వేలలోపు డిపాజిట్‌లున్న వారు 10 లక్షల మంది ఉన్నారని అంచనా వేయగా, వారిలో ఆరు లక్షల మందికి ప్రభుత్వం రూ.964 కోట్లను చెల్లించింది. మిగిలిన వారి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమకాలేదు. వీరిలో ఒక్కొక్కరికి రెండు మూడు బాండ్‌లు ఉన్నప్పటికీ ఒక్క బాండ్‌కే చెల్లింపు చేశారు. రూ.20 వేలపైబడి డిపాజిట్ చేసిన బాధితులు 13.52 లక్షల మంది ఉన్నారు. వారికి ఆర్థిక సహాయం

అందించే అంశాన్ని బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు. అగ్రిగోల్డ్ సంస్థకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.35 వేల కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు సాక్షాత్తు హోంశాఖ మంత్రి మేకతోటి సుచరిత ప్రకటించారు. ఇందులో హారుల్యాండ్ విలువే రూ.5 వేల కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఇప్పటికే వాటన్నింటినీ కోర్టుకు అటాచ్ చేశారు. ఆస్తులను వేలం వేసి బాధితులందరికీ డిపాజిట్‌లను చెల్లిస్తామన్న గత, ప్రస్తుత ప్రభుత్వాల హామీలు నెరవేరడంలేదు. కోర్టుకు అటాచ్ చేసిన అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులన్నింటినీ ఒకేసారి వేలం నిర్వహించాలి. ఇందుకోసం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లా జడ్జి, సబ్ రిజిస్ట్రార్‌తో కూడిన త్రిసభ్య కమిటీని నియమించాలి. అపుడే బాధితులందరికీ న్యాయం జరుగుతుంది. ఆరు నెలల్లో అందరికీ డిపాజిట్‌లను చెల్లిస్తానన్న సిఎం జగన్ తన హామీని నెరవేర్చలేదు. కనీసం బడ్జెట్‌లో బాధితుల ప్రస్తావనే లేకపోవడం బాధాకరం.'

## ఎన్నికల వేళ... మళ్లీ కాపు పదం

కాకినాడ, మార్చి 23, కాపు రిజర్వేషన్ ఉద్యమ పోరాట సమితి నేతగా ముద్రగడ పద్మనాభం పేరును ఏపీ రాజకీయాల నుంచి వేరు చేసి చూడలేం. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ముద్రగడ ముఖ్యమైన పాత్ర పోషించాలని ప్రతి రాజకీయ పార్టీ కోరుకుంటుంది. ముద్రగడ బలమైన కాపు సామాజికవర్గాన్ని ప్రభావితం చేయగలరన్న నమ్మకమే ఇందుకు కారణం. అయితే ఆయన కొంతకాలంగా కాపు ఉద్యమాలకు కూడా దూరంగా ఉంటున్నారు. సోషల్ మీడియాలో తన కుటుంబంపై చేసిన ఆరోపణల నేపథ్యంలో ఆయన కాపు ఉద్యమం నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించార. అయినా ముద్రగడ పద్మనాభం ముఖ్యమంత్రులకు, ప్రధానమంత్రులకు కాపుల ప్రయోజనాల కోసం లేఖలు రాస్తూనే ఉన్నారు. అంటే తాను ఇంకా యాక్టివ్ గానే ఉన్నానని పరోక్షంగా సంకేతాలను ఇచ్చినట్లే. ప్రస్తుతం ఏపీలో కాపు నేతలు ప్రత్యేకంగా సమావేశాలను నిర్వహిస్తున్నారు. ముద్రగడను పక్కన పెట్టి వీరంతా ప్రత్యామ్నాయం కోసం ప్రయత్నిస్తున్నారు. కాపులకు రాజ్యాధికారం కావాలన్న ఏకైక డిమాండ్ తోనే వారు ఈ సమావేశాలను నిర్వహిస్తున్నారు. అయితే ఈ సమావేశాల వెనక పరోక్షంగా ముద్రగడ సలహాలు, సూచనలను అందిస్తున్నట్లు తెలిసింది. ఇక ముద్రగడ పద్మనాభంకు వివిధ రాజకీయ పార్టీల నుంచి ఆహ్వానాలకు కొదవ లేదు. ప్రధాన జాతీయ పార్టీ ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించింది. అయినా ఆయన సున్నితంగా తిరస్కరించినట్లు చెబుతున్నారు. మరో ప్రాంతీయ పార్టీ ఆయనకు రాజ్యసభ టిక్కెట్ ను కూడా ఆఫర్ చేసింది. దీనికి కూడా ముద్రగడ పద్మనాభం ఒప్పుకోలేదని తెలిసింది. కేవలం కాపు ప్రయోజనాల కోసమే తాను పనిచేస్తానని, పదవుల అవసరం లేదని వారికి చెప్పినట్లు తెలిసింది.... అయితే ఇటీవల కాలంలో కాపులను ఒక పార్టీ వైపునకు తీసుకు పోయే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ముద్రగడ భావిస్తున్నారు. టీడీపీకి అనుకూలంగా కాపు ఓటు బ్యాంకు మారే అవకాశముందని భావించిన ఆయన కొందరు కాపు పెద్దలతో మాట్లాడరని తెలిసింది. తమను మోసం చేసిన చంద్రబాబుకు మద్దతిచ్చి మరోసారి మోస పోవద్దని కూడా ముద్రగడ వారివద్ద కుండబద్దలు కొట్టినట్లు తెలిసింది. కాపుల్లో ఐక్యత వస్తే రాజ్యాధికారం సాధించడం పెద్ద కష్టమేమీ కాదని, తాత్కాలిక ప్రలోభాలకు గురై కొన్ని పార్టీలకు మద్దతిస్తే కాపు జాతికి అన్యాయం చేసినట్లేనని ఆయన వ్యాఖ్యానించారని చెబుతున్నారు.

## జగన్ కు బిగ్ షాక్

విజయవాడ, మార్చి 23, నిబంధనలు తుంగలో తొక్కడంలో జగనన్న తర్వాతే ఎవరైనా. రూల్స్ ఒప్పుకోకున్నా.. తన వారిని అందలమెక్కించారు. అడ్డగోలుగా పదవులు పంచేశారు. కేంద్రం కాదూకూడదన్నా వినిపించుకోలేదు. ఇక ఇలా అయితే కుదరదని.. ఢిల్లీ నుంచి స్ట్రాంగ్ వార్నింగ్ వచ్చింది. ఇక చేసేది లేక, తప్పేలా లేదని.. తన వారితో



రాజీనామాలు చేయించింది. ఇలా స్మార్ట్ సిటీ మిషన్ ఛైర్మన్ల విషయంలో జగనన్నకు బిగ్ షాక్ తగిలింది. ఇంతకీ మేటర్ ఏంటంటే.. స్మార్ట్ సిటీల నామినేటెడ్ ఛైర్మన్ల విషయంలో కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. తిరుపతి, ఏలూరు, విశాఖ, కాకినాడ స్మార్ట్ సిటీల ఛైర్మన్లు తమ పదవులకు రాజీనామా చేశారు. విశాఖ స్మార్ట్ సిటీ ఛైర్మన్ జి.వెంకటేశ్వర రావు, కాకినాడ స్మార్ట్ సిటీ ఛైర్మన్ ఏ.రాజు బాబు, ఏలూరు స్మార్ట్ సిటీ ఛైర్ పర్సన్ బి.అఖిల, తిరుపతి స్మార్ట్ సిటీ ఛైర్ పర్సన్ ఎన్. పద్మజలు తమ పదవులకు రాజీనామా చేశారు. సాంకేతికంగా స్మార్ట్ సిటీ మిషన్లకు నామినేటెడ్ నియామకాలు చెల్లవని కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి శాఖ ఏపీ ప్రభత్వానికి లేఖ రాసింది. తక్షణం రాజీనామాలు చేయించాలని గత డిసెంబర్‌లో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ తేల్చి చెప్పింది. కేంద్ర ప్రభుత్వం రాసిన లేఖ మేరకు రాష్ట్రంలో స్మార్ట్ సిటీ మిషన్ ఛైర్మన్లతో ప్రభుత్వం రాజీనామాలు చేయించింది. ఇన్నాళ్లుగా నిధులు లేకున్నా.. ఆఫీసు, సిబ్బంది కూడా లేకున్నా.. నామినేటెడ్ పోస్టులతో ఫోజులు కొట్టారు ఆ నలుగురు వైసీపీ నేతలు. తాజా రాజీనామాలతో అధికార పార్టీ పరువు పోయినట్లైంది. అయితే, సీఎం జగన్‌కు పంపిన లేఖల్లో వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్టు తెలపడం ఆసక్తికరం.

## ప్రారంభం కాని జగనన్న కాలనీలు

విజయవాడ, మార్చి 23, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీల పేరుతో ప్రభుత్వం మొదటి ఫేజ్‌లో 15.60 లక్షల గృహ నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకు 11.65 లక్షల ఇళ్లు గ్రౌండింగు కాగా, 3.95 లక్షల ఇళ్లు గ్రౌండింగుకు ఇంకా నోచుకోలేదు. పునాది దశ, ఆ పైన దశలో 3 లక్షల ఇళ్లు మాత్రమే ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. నిర్మాణ వ్యయాన్ని తగ్గించడానికి 500 కంటే ఎక్కువ గృహాలు కలిగిన పెద్ద లే అవుట్ల దగ్గర సిమెంటు, ఉక్కు, ఇతర నిర్మాణ సామగ్రిని నిల్వ చేయడానికి ప్రభుత్వం ఇప్పటి వరకు 65 తాత్కాలిక గోదాములను మంజూరు చేసింది. వీటిలో ఇప్పటి వరకు ఎన్ని పూర్తయ్యాయనే విషయంపై ప్రభుత్వం వద్ద స్పష్టత లేదు. వెయ్యి గృహాల కంటే ఎక్కువ ఉన్న లే అవుట్లలో ఇటుక/బ్లాక్ తయారీ యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి కేవలం 157 యూనిట్లనే ఏర్పాటు చేసినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. గోదాముల నిర్మాణాలు వేగవంతం కాకపోవడంతో ఆయా కాలనీల్లో నిర్మాణాలు చేపట్టిన గృహ యజమానులకు ఇనుము, సిమెంటు, ఇసుకతో పాటు నిర్మాణ సామగ్రిని నిల్వ చేసుకోవడం ఇబ్బందికరంగా మారింది. లే అవుట్లలోని అప్రోచ్ రోడ్లు చేపట్టడం, విద్యుత్ వస్తువుల తరలింపు, గోదాముల నిర్మాణం, భూమిని చదును చేయడం, ఇతర మౌలిక సదుపాయాల పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.282.31 కోట్లను మంజూరు చేసింది. శాశ్వత మౌలిక సదుపాయాల కోసం రూ.32,909 కోట్లు డిపిఆర్ కోసం ప్రభుత్వం నివేదికలను రూపొందించనుంది. జనాభా ప్రాతిపదికపై లే అవుట్లలో పాఠశాలలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, బహిరంగ ప్రదేశాలు, పార్కులు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలతోపాటు సామాజిక మౌలిక సదుపాయాల కోసం ప్రణాళికలను అధికారులు సిద్ధం చేశారు. గృహ నిర్మాణాల్లో నాణ్యత తనిఖీల కోసం ప్రభుత్వం 'వాప్కోస్' ద్వారా థర్డ్‌పార్టీని నియమించింది. ఇందుకోసం గృహ నిర్మాణ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు తిరుపతిలోని ఐఐటి ద్వారా ప్రభుత్వం నాణ్యత అంశాలపై శిక్షణ ఇచ్చింది.

## డ్వాక్రా గ్రూపులకు రాని రుణాలు

నెల్లూరు, మార్చి 23 ,స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) రుణాల్లో జాతీయస్థాయిలో 30 శాతం వాటా కలిగిన రాష్ట్రంలో కొత్త రుణాలు క్రమంగా తగ్గుతున్నాయి. ఇతర రాష్ట్రాలతో పోల్చితే రీపేమెంట్ 99 శాతం ఉన్నప్పటికీ కొత్త రుణాలంటేనే రాష్ట్రంలో డ్వాక్రా గ్రూపుల సభ్యులు భయపడుతున్నారు. రుణాలను తిరిగి చెల్లించే సామర్థ్యం పడిపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. డ్వాక్రా గ్రూపులకు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం బ్యాంకర్లకు టార్గెట్లను పెడుతున్నప్పటికీ, తీసుకునేందుకు గ్రూపులు మాత్రం ముందుకు రావడంలేదు. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం 3.13 లక్షల గ్రూపులు రుణాలు తీసుకోలేదని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఒక నివేదిక వెల్లడించింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్‌నాటికి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 4,05,269 గ్రూపులకు బ్యాంకులు రూ.18,192 కోట్ల రుణాలను బట్వాడా చేసింది. 2020-21 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 3.13 లక్షల గ్రూపులు తగ్గగా, రుణ విలువ రూ.1,900 కోట్లు తక్కువగా ఉంది. ప్రభుత్వం తొమ్మిది శాతం వడ్డీకే లింకేజీ రుణాలను ఇస్తున్నప్పటికీ, డ్వాక్రా గ్రూపు సభ్యులు రుణాలు తీసుకునేందుకు వెనుకడుగు వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే పట్టణ ప్రాంతాల్లో రుణాలు తీసుకోని గ్రూపులే అధికంగా ఉన్నట్లు రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బిసి) ఇటీవల వెల్లడించింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్‌నాటికి బ్యాంకులు 2,17,129 గ్రూపులకు 10,859 కోట్ల లింకేజీ రుణాలను బట్వాడా చేశాయి. ఇందులో రూరల్ ఎస్‌హెచ్‌జిలు 1,97,387 గ్రూపులుండగా, పట్టణ ప్రాంతాలకు చెందినవి 19,747 మాత్రమే ఉండటం గమనార్హం. గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్‌హెచ్‌జిలు 50 నుంచి 55 శాతం మంది రుణాలు తీసురకుంటుండగా, పట్టణ ప్రాంతాల్లో 25 శాతానికి మించడంలేదు. రాష్ట్రంలో రెండేళ్లగా ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. డ్వాక్రా గ్రూపుల్లో వ్యవసాయ కార్మికులు, చిరు వ్యాపారులు, స్వయం ఉపాధి పొందేవారే అధికంగా ఉన్నారు. కరోనా కారణంగా పేద, బడుగు వర్గాల ఆర్థిక పరిస్థితులు చిన్నాభిన్నమయ్యాయి. కార్పొరేట్, ప్రైవేటు సంస్థల ఇన్‌స్టాల్‌మెంట్‌లను ప్రభుత్వం వాయిదా వేసింది. అయితే, డ్వాక్రా గ్రూపు రుణాలకు అలాంటి మినహాయింపు లేకపోవడంతో చాలా సంఘాలు డిఫాల్టర్‌గా మారాయి. తీసుకున్న రుణాన్నిబట్టి ప్రతి నెలా కనీసం రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు కిస్తీ కట్టాల్సి రావడం, సమయానికి డబ్బులు అందకపోవడంతో కొందరు సభ్యులు కట్టలేని పరిస్థితి వచ్చింది. దీంతో చాలా మంది సభ్యులు గ్రూపుల నుంచి వైదొలగగా, కొన్ని గ్రూపులు రుణాలు తీసుకోవడమే మానేశాయి. ఫలితంగానే రుణాల బట్వాడా తగ్గినట్లు బ్యాంకర్లు చెబుతున్నారు.

## ఏటికొప్పాక చక్కెర కంపెనీ కార్మికుల ధర్నా

విశాఖపట్నం విశాఖ జిల్లా ఎస్.రాయవరం మండలం దార్లపూడిలో ఏటికొప్పాక సహకార చక్కెర కర్మాగారం గేట్ ముందు కార్మికులు, రైతులు ధర్నా చేసారు. రైతులకు బకాయిలు,ఫ్యాక్టరీ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి అంటూ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు,ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసే రైతులు ధర్నా నిర్వహించారు. ఈధర్నాలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్,సి.పి.ఎం.పార్టీ నాయుకులు పాల్గోని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోడపాటి శివదత్ మాట్లాడుతూ ఏటికొప్పాక సహకార చక్కెర కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు,కర్మాగారాన్ని చెరుకు సరఫరా చేసే రైతులకు బకాయిలు చెల్లించే వరకు జనసేన పార్టీ వీళ్లకు అండగా ఉంటుంది. దీనిపై జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తాను. ఖచ్చితంగా వీళ్లకు న్యాయం చేకూర్చేలా పోరాటం ఇంకా ఉదృతం చేస్తామని అన్నారు.

## ట్రాఫిక్ అవగాహన ర్యాలీ

నూజివీడు నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో "మైనర్ మరియు ట్రిపుల్ రైడింగ్ వ్యతిరేక ర్యాలీ" ని నూజివీడు పోలీసులు నిర్వహించారు. నూజివీడు గవర్నమెంట్ హాస్పిటల్ మీదుగా పెద్ద గాంధీబొమ్మ వరకు నూజివీడు పోలీస్ అధికారులు, సిబ్బందితో కలసి ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్ ఎన్.ఎస్.ఎస్ యూనిట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో "మైనర్ మరియు ట్రిపుల్ రైడింగ్ వ్యతిరేక ర్యాలీ" నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ శ్రీనివాసులు, నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ శ్రీనివాసరావులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టిన చర్యల్లో భాగంగా మైనర్లు డ్రైవింగ్, మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ, ట్రిపుల్ రైడింగ్ చెయ్యడం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు తెలియజేయాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ముఖ్యంగా లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని, మితిమీరిన వేగంతో ప్రమాదానికి గురై తమ ప్రాణాలను పోగొట్టుకోవడంతో పాటు ఇతరుల ప్రాణాలతో చెలగాటం అడవద్దని సూచించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురైతే వారి తల్లిదండ్రులను భాద్యులను చెయ్యడం జరుగుతుందన్నారు. అందువల్ల మైనర్లకు వాహనాలు నడపడానికి తల్లిదండ్రులు అవకాశం కల్పించవద్దన్నారు. ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడిపి ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు, మరియు నూజివీడు టౌన్ సిఐ అంకబాబు, పట్టణ ఎస్సైలు తలారి రామకృష్ణ, వెంకటేష్, సిబ్బంది పాల్గొనున్నారు.

## బద్వేల్ లో ఘనంగా సర్దార్ భగత్ సింగ్ వర్ధంతి

బద్వేలు భగత్ సింగ్ 91వ వర్ధంతిని బద్వేల్ ఏ ఐ ఎస్ ఎఫ్ పట్టణ సమితి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ దగ్గర వున్న భగసింగ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళర్పించారు.ఏఐఎస్ఎఫ్ ఏరియా కార్యదర్శి యం.అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు,యువకులు రాజకీయాల్లోకి రావాలని అన్నారు. భగసింగ్ లాంటి స్వతంత్ర సమరయోధుల స్పూర్తితో భాటలు వేయాలన్నారు.తదనంతరం వారి స్పూర్తిని వివరించారు.1931 మార్చి 23న భగసింగ్,రాజ్ గురు, సుఖదేవ్ లను ఉరి తీయడం జరిగిందన్నారు. భారత స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రఖ్యాత ఉద్యమకారుడు. ఢిల్లీ వీధిలో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలను చైతన్య పరిచాడు. విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని ఇచ్చింది కూడా భగత్ సింగే. భారత స్వాతంత్ర్యోద్యమం లో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారులలో ఆయన ఒకడు. ఈ కారణంగానే షహీద్ భగత్ సింగ్ గా కొనియాడబడుతున్నాడు.భారత్లో బ్రిటీషు పాలన ను వ్యతిరేకిస్తూ విప్లవాత్మక ఉద్యమాలను చేపట్టిన కుటుంబంలో ఆయన జన్మించాడు. యుక్త వయస్సులోనే ఐరోపా విప్లవ ఉద్యమాలను గురించి చదివిన సింగ్ అరాజకవాదం, సామ్యవాదమునకు ఆకర్షితుడయ్యాడు.భారత, బ్రిటన్ రాజకీయ ఖైదీలకు సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ జైలులో 64 రోజుల నిరాహారదీక్షను చేపట్టడం ద్వారా సింగ్ విపరీతమైన మద్దతును కూడగట్టుకున్నాడు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు లాలా లజ్పత్ రాయ్ హత్య నేపథ్యంలో ఒక పోలీసు అధికారిని కాల్చినందుకు ఆయన్ను ఉరితీశారని అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నెల్లూరు నెల్లూరు ముంబై జాతీయ రహదారి పై దామరమడుగు మఠం సంఘం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆత్మకూరు డిపో బస్సు నెల్లూరు నుండి ఆత్మకూరు వైపు వెళుతూ ఆర్.ఆర్ పురం వద్ద రోడ్డు మార్జిన్ లో ఆగివున్న లారీని అతి వేగంగా ఢీ కొట్టి పక్కనే ఉన్న పొలాల్లోకి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా పదిమందికి తీవ్ర గాయాలు అయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు.

## గంజాయిని దగ్ధం చేసిన పోలీసులు

చింతలపూడి పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల లో అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన గంజాయిని ఈ రోజు తమ్మిలేరు జలాశయం ఒడ్డున స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఉన్నత అధికారుల సమక్షంలో మంటల్లో కాల్చారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఆంధ్ర ప్రదేశ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, మరియు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ సత్తిబాబు మాట్లాడుతూ పశ్చిమ గోదావరి మరియు కృష్ణా జిల్లాల్లో పట్టుబడిన గంజాయి సుమారు 557 కిలోలు రెండు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన తమ్మిలేరు జలాశయం ఒడ్డున గంజాయిని కాల్చి వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా, కృష్ణాజిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ లు, సబ్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## తోపుడు బండ్ల పంపిణీ

విజయవాడ రామలింగేశ్వర నగర్లోని దేవినేని రాజశేఖర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.50 వేలు విలువ చేసే తోపుడు బండ్లు పంపిణీ, రూ.50 లక్షల నిధులతో క్రైస్తవ స్మశాన వాటికను తూర్పు నియోజకవర్గ ఇంఛార్జ్ దేవినేని అవినాష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్య లక్ష్మి, డిప్యూటీలు మేయర్ బెల్లం దుర్గ, శైలజా రెడ్డి, వైస్సార్సీపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.తూర్పు నియోజకవర్గ ఇంఛార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ టీడీపీ గద్దె రామ్మోహనరావు అసెంబ్లీలో చిల్లరితనంగా ప్రవర్తించారు. విజయవాడ నగర పరువు తీసే విధంగా గద్దె రామ్మోహన్ వ్యవహరించారు. రాజ్యాంగ బద్ధంగా స్పీకర్ పై ఇలాంటి చర్యలకు పాల్పడటం చాలా దారుణం. టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూటు బూటు తో హుందాతనం రాదు. సభ మర్యాదలు పాటించినని గద్దె రామ్మోహన్ స్పీకర్ కి సభా సాక్షిగా క్షమాపణ చెప్పాలని అన్నారు.టీడీపీ షో రాజకీయాలు చేయటం మానుకోవాలి. తూర్పు నియోజకవర్గంలో రూ.350 కోట్లలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

# అర్ధరాత్రి ఆపరేషన్ చబుత్ర



**జులాయి గా తిరుగుతున్న ఆకతాయిలపై కొరడా జులిపించిన పోలీసులు**

**రాత్రి 10 గంటల తరువాత అనవసరంగా రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు**

**గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్**



గోదావరిఖని మార్చి 23 ఆపరేషన్ చబుత్ర లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ గారి ఆదేశాల మేరకు గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్ అదేసానుసారం 1టౌన్ సీఐ రమేష్ బాబు, రామగుండం సీఐ లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో రాత్రి 10.00 గంటలకు ప్రతి గల్లీలో, ప్రతి ఏరియాలో ఆర్టీసీ బస్టాండ్, ఏన్టీపీసీ, అన్నపూర్ణ కాలనీ, కృష్ణ నగర్ ఇతర ప్రాంతాలలో లో రాత్రి 10 గంటల తరువాత రోడ్లపై అనవసరంగా తిరిగుతు, ద్విచక్ర వాహనాల సైలెన్సర్ల సౌండ్ పెంచుతూ, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా గల్లీలో తిరుగుతున్నా వారిని, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారిని, మద్యం సేవించి న వారిని పట్టుకున్నారు వారిపై ఏమైనా నేరచరిత్ర ఉన్నాయ లేదా అని తెలుసుకోవడానికి మొబైల్ ఫింగర్ ప్రింట్స్ చెక్ డివైజ్ తో చెక్ చేయడం జరిగింది. అలాగే అర్ధరాత్రి గల్లీలో మద్యం సేవించి ద్విచక్ర వాహనల పై తిరుగుతు జులాయి గా తిరుగుతూన్న వారిపై కేసులు నమోదు చేసి 1టౌన్ పోలీస్ స్టేషన్, ఏన్టీపీసీ కి తరలించి కౌన్సిలింగ్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఏసీపీ గిరి ప్రసాద్ మాట్లాడుతూ...అసాంఘిక కార్యక్రమాలకు ఎవరూ పాల్పడవద్దని, ముఖ్యంగా యువకులు పోకిరీలుగా అవతారం ఎత్తి తమ భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని ఏసీపీ గారు సూచించారు. అంతేకాకుండా చెడు వ్యసనాలకు అలవాటు పడే అవకాశం ఉన్నదని, తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ రోజు నుండి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించడం జరుగుతుంది అని రాత్రి సమయంలోఎవరైనా యువకులు రోడ్లపై విన్యాసాలు చేస్తూ, గుంపులుగా కనబడితే వారిని అరెస్ట్ చేసి వాహనాలను సీజ్ చేస్తామన్నా రు. యువకులు ఇప్పటినుంచే, చట్టవ్యతిరేకమైన, నేరాల్లో పాల్గొంటే భవిష్యత్ ఉండదని యువకులకు సూచించారు. ప్రతి రోజు రాత్రి 10 గంటలలోపే పని ముగించుకొని ఎవరి ఇండ్లలో వారు ఉండాలి అలా కాకుండా అనవసరంగా రోడ్లపై మద్యం సేవిస్తూ గల్లీలో తిరుగుతూ, పోకిరి చేష్టలు చేసేవారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏసీపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐలు 2టౌన్ శ్రీనివాసరావు, రామగుండం సిఐ లక్ష్మి నారాయణ, సయ్యద్ అఫ్జలొద్దిన్, ఎస్సైలు రమేష్, స్వామి, నరేష్ కుమార్, శైలజ, అంతర్గం ఎస్ ఐ శ్రీధర్,ఏన్టీపీసీ ఎస్ ఐ కుమార్ కళాధర్ రెడ్డి,మరియు ఏఎస్సైలు,40 మంది కానిస్టేబుల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థిని ఆత్మహత్య

పలమనేరు చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణంలోని ఓ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ప్రిన్సిపల్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు బాలిక తండ్రి ఆరోపిస్తుంటే.. విద్యార్థిని సక్రమంగా చదవకపోవడంతో పరీక్షల ఒత్తిడితో ఆత్మహత్యకు పాల్పడిందని పాఠశాల యాజమాన్యం పేర్కొంటోంది.సక్రమంగా చదవడం లేదని మరో పాఠశాలలో చేర్పించుకోండని ప్రిన్సిపల్ రమేష్ మూడు రోజుల కిందట విద్యార్థినిని ఇంటికి పంపాడు. బాలిక తండ్రి మరో పాఠశాలలో చేర్పించగా ఆ పాఠశాల యాజమాన్యం కూడా మీ అమ్మాయి మూడు రోజుల నుంచి చదవకుండా ముభావంగా ఉందని తీసుకెళ్లమని మంగళవారం తండ్రితో పంపారు. ప్రిన్సిపల్ రమేష్ తనను దురుద్దేశంతో చదవడం లేదనే కారణం చూపిస్తున్నాడని.. ఇంటికి వస్తుంటే దారిలో కుమార్తె ఏడ్చినట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన భవిష్యత్తు అతని కారణంగానే పాడైందని వాపోయినట్లు చెప్పాడు. అలా ఇంటికి వచ్చి దుస్తులు మార్చుకోవాలని గదిలోకెళ్లిన కుమార్తె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తమ బిడ్డ చావుకు కారణమైన పాఠశాలను మూసేస్తూ ప్రిన్సిపల్ను అరెస్టు చేయాలని కుటుంబసభ్యులు మొదట పాఠశాల వద్ద ఆందోళన చేస్తుంటే పోలీసులు అడ్డుకుని అక్కడి నుంచి పంపేశారు. అనంతరం వారు పట్టణంలోని పోలీసు స్టేషన్ ఎదుట రోడ్డుపై ధర్నా చేశారు. ఉపాధ్యాయుడిని అరెస్టు చేసే వరకు వెనక్కు వెళ్లమని స్పష్టం చేశారు. అనంతరం పోలీసులు వారికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపేశారు. బాలిక ఆత్మహత్య చేసుకుంది చదువు ఒత్తిడితోనా.. వేధింపులతోనా అనే విషయాలపై గంగవరం సీఐ రామకృష్ణమాచారి ఆధ్వర్యంలో పలమనేరు ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.విద్యార్థి మృతికి కారకుడైన ప్రిన్సిపల్ రమేష్ను 24 గంటల్లో అరెస్టు చేస్తామని పోలీసులు హామీ ఇచ్చారు.రాత్రి మృతురాలి కుటుంబ సభ్యులు వారి మద్దతుదారులు పట్టణంలోని అటవీశాఖ కార్యాలయం సమీపంలో నాలుగోనంబరు జాతీయ రహదారిపై బైఠాయించారు. చిత్తూరు డీఎస్పీ సుధాకరరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఆందోళనకారులతో మాట్లాడి సర్దిచెప్పారు.

# జంట హత్యలకేసులో అన్నే నిందితుడు

కడప ఆర్ధిక లావాదేవీల మధ్య కుటుంబ సభ్యులను హత్య చేసిన నిందితులను కడప పోలీసులు అరెష్టు చేశారు.కడప జిల్లా ప్రొద్దుటూరులో జంటల హత్యల కేసును చేదించిన పోలీసులు దీనికి ఆస్తి తగాదాలుగా తేల్చారు.తరతరాలుగా వస్తున్న ఆస్తి పంపకాల విషయంలో ప్రొద్దుటూరులో జరిగిన దంపతుల హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. సొంత తమ్ముడు, మరదలు అని కూడా చూడకుండా రాడ్డుతో తలపై మోది అంతమొందించినట్లు డీఎస్పీ ప్రసాదరావు తెలిపారు.నీలాకరం మోషే , సరోజమ్మలు ప్రొద్దుటూరు దస్తగిరిపేటలో నివాసం ఉండే వారు. నిందితుడు యేసయ్య వివాహం చేసుకుని కర్నూలు జిల్లా పేరుసోములలో స్థిరపడ్డారు. రెండేళ్ల క్రితం ప్రొద్దుటూరు వచ్చి మోషే ఉంటున్న వెనుక వీధిలో బాడుగకు ఇళ్లు తీసుకుని నివసిస్తున్నాడు. అయితే దస్తగిరిపేటలోని ఆస్తి విషయమై అన్నదమ్ముల మధ్య సుమారు 15 ఏళ్లుగా తగాదాలు ఉన్నాయి. మోషేతో నిందితుడు యేసయ్య అప్పుడప్పుడు గొడవపడుతుండే వాడు. రెండు రోజుల కిత్రం కూడా ఆస్తి ఇవ్వకపోతే చంపుతానని బెదిరించాడని... ఈ క్రమంలోనే సోమవారం ఉదయం ఇంటి వద్ద ఉన్న తమ్ముడు మోషే, మరదలు సరోజమ్మలతో గొడవపడ్డాడని డీఎస్పీ తెలిపారు. దీంతో తన వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్డుతో ఇద్దరిని తలపై మోదడంతో కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారన్నారు. నిందితుడిని మోడంపల్లి బైపాస్ రోడ్డు సమీపంలో అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు. దంపతుల హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకున్నారు.

## తాడిపత్రిలో విజయేంద్రస్వామి పర్యటన

అనంతపురం అనంతపురం జిల్లా తాడిపత్రిలో బుగ్గరామలింగేశ్వరస్వామి, చింతల వెంకటరమణస్వామి ఆల యాలతోపాటు పలు ఆలయాలను కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజ యేంద్ర సరస్వతి స్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో అర్చకులు ఆయనకు పూర్ణకుం భంతో ఘనంగా స్వాగతం పలికారు. బుగ్గరామలింగేశ్వరునికి, చింతల వెంకటరమణుడు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయాల చరిత్రతోపాటు శిల్పకల సంపద గురించి అర్చకులు పీఠాధిపతికి వివరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ 1982 సంవత్సరంలో మా గురువుతోపాటు చింతలవెంకటరమణస్వామి ఆలయాన్ని సందర్శించానన్నారు. అప్పట్లో ఆలయం ముందు కోనేరు ఉండేదని వాటిలో శ్రీవారికి చక్రస్నానం చేయించేవారన్నారు. కోనేరును పునఃనిర్మాణం చేయాలని ఆయన కమిటీ సభ్యులకు సూచించారు. వేదమాత గాయత్రీదేవి ఆలయంలో అమరలింగేశ్వరునికి పీఠాధిపతి అభిషేకం చేశారు. అనంతరం పట్టణం లోని ఏటిగడ్డపాలెంలో నిర్మిస్తున్న బ్రాహ్మణసంఘం నూతన భవనాన్ని పీఠాధిపతి పరిశీలించారు. వరాలుతోటలో ఉన్న శ్రీకృష్ణుని విగ్రహాన్ని సందర్శించారు.

# మున్సిపాల్టీల్లో బీపాస్

అదిలాబాద్, మార్చి 23, మున్సిపాలిటీల్లో లెక్కనే గ్రామ పంచాయతీల్లోనూ టీఎస్ బీపాస్(తెలంగాణ స్టేట్ బిల్డింగ్ పర్మిషన్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ అసెస్మెంట్ సర్టిఫికెషన్) అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ రూరల్ డెవలప్?మెంట్ డిపార్ట్?మెంట్ జీవో నంబర్ 52 విడుదల చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలతో పాటు గ్రామ పంచాయతీల్లోనూ కామన్ బిల్డింగ్ రూల్స్ అమలవుతాయని పేర్కొంది. తద్వారా గ్రామాల్లో అక్రమ నిర్మాణాలకు బ్రేక్ పడుతుందని స్పష్టం చేసింది. వచ్చే నెల నుంచే ఈ కొత్త విధానాన్ని అమలు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చింది.ప్రస్తుతం గ్రామపంచాయతీల్లో ఈ?పంచాయతీ ద్వారా బిల్డింగ్ పర్మిషన్లు ఇస్తున్నారు. సంబంధిత డాక్యుమెంట్లతో పంచాయతీ సెక్రటరీలకు అప్లై చేసుకుంటే వారు పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తున్నారు. 300 గజాల వరకు పంచాయతీ పరిధిలోనే పర్మిషన్లు ఇస్తున్నారు. అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణాలు చేపడితే జిల్లా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) ద్వారా మంజూరు చేస్తున్నారు. గ్రామాల్లో చాలావరకు 300 గజాలలోపే నిర్మాణాలు జరుగుతున్నాయి.ప్రస్తుతం అన్ని మున్సిపాలిటీల్లో టీఎస్ బీపాస్ ద్వారా బిల్డింగ్ పర్మిషన్లు జారీ చేస్తున్నారు. బిల్డింగ్ ప్లాన్?తో పాటు సంబంధిత డాక్యుమెంట్లు జతచేసి మీసేవలో అప్లై చేసుకోవాలి. రెవెన్యూ, మున్సిపల్ ఆఫీసర్లు వాటిని పరిశీలించి అన్నీ సక్రమంగా ఉంటే పర్మిషన్లు ఇస్తున్నారు. 21 రోజుల్లోగా పర్మిషన్ ఇవ్వకపోతే.. అనుమతిచ్చినట్టే భావించి బిల్డింగ్ కట్టుకోవచ్చు. ఇకపై ఈ సిస్టమ్ గ్రామ పంచాయతీల్లోనూ అమలు కానుంది. దీనికి అనుగుణంగా సాఫ్ట్?వేర్ తయారు చేస్తున్నారు.

# సీపీఎం ధర్నా

విశాఖపట్నం పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను నిరసిస్తూ సిపిఎం పార్టీ వినూత్న నిరసన నిర్వహించింది. మద్దిలపాలెం సిపిఎం కార్యాలయం నుంచి గ్యాస్ బండలు భుజం మీద మోసుకుంటూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజలను నట్టేట ముంచక ముందే ప్రజలు తిరగబడాలి అని పిలుపునిచ్చారు. సిపిఎం నగర కార్యదర్శి జగ్గు నాయుడు మాట్లాడుతూ పెట్రోల్, వంట గ్యాస్ పై భారాలు మోపి ప్రజల మూలుగు పీల్చే పరిస్థితిలో బీజేపీ ప్రభుత్వం ఉందన్నారు. విపరీతంగా పెరుగుతున్న ధరల వలన నిత్యావసర ధరలు పెరిగిపోతున్నాయని, ఇలా పెరిగితే సామాన్య మధ్య తరగతి ప్రజలు బ్రతుకులు ఏమవ్వాలి అని ప్రశ్నించారు. తక్షణం పెరిగిన ధరలు తగ్గించకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు.

## పెంచిన ఇంధన ధరలు తగ్గించాలి

**కామనురు శ్రీనివాసులురెడ్డి**

బద్వేలు పెద్ద మొత్తంలో డీజిల్ కొనుగోలు చేసేవారికి ధరలు పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర రవాణా సంస్థలపై, ఇతర బల్క్,గ్యాస్ సిలిండర్ వినియోగదారులపై ఇది మరొక దాడి అని, దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుందని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కామనురు శ్రీనివాసులురెడ్డి ఈ రోజు కమలాపురం జరిగిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ . అంతిమంగా ఈ భారం ప్రజా రవాణా వ్యవస్థలను ఉపయోగించే సామాన్యులపై పడుతుందన్నారు. ఇప్పటికే పెరిగిన ధరలపై తాజా చర్య మరింత భారాన్ని మోపుతుందని అన్నారు. పెరుగుతున్న రవాణా వ్యయాలతో సామాన్యుల జీవితాలు మరింత దుర్భరంగా మారనున్నాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలపై ముఖ్యంగా ప్రజా రవాణా వ్యవస్థలపై ఇది మరో తరహా దాడి అని వ్యాఖ్యానించారు. తక్షణమే కేంద్రం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించాలని తపన్సేన్ డిమాండ్ చేశారు. ఈనెల 28, 29 తేదీల్లో జరగబోయే సార్వత్రికసమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొనాల్సిందిగా ప్రభుత్వ రవాణా కార్మికులకు సిఐటియు పిలుపిచ్చింది. పెట్రోలు,డీజిల్, గ్యాస్ కేంద్రంలోని బిజెపి సర్కార్ తీసుకున్న డీజిల్ బల్క్ బయ్యర్ల ధరల పెంపు నిర్ణయం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలకు గొడ్డలిపెట్టు వంటిదని . ప్రభుత్వం వెంటనే స్పందించి, ఈ పెంచిన ధరలను ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిర్ణయాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఈ నెల 24న నిరసనలు పాటించాల్సిందిగా అనుబంధ యూనియన్లు, సమాఖ్యలకు పిలుపునిచ్చింది.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి టి.రమేష్ ఆటో యూనియన్ కార్యదర్శి మధ్యల.రాజేష్ ఎస్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు..

## కాలుష్య నగరాలు భారత్ లోనే ఎక్కువ

న్యూఢిల్లీ, మార్చి 23, కరోనా మహమ్మారి విజృంభణ సమయంలో.. విధించిన లాక్డౌన్లు, ఆంక్షలతో ఎన్నడూ లేని విధంగా కాలుష్యం తగ్గిపోయినట్టు గణాంకాలు వెల్లడించాయి.. మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి.. దీంతో.. దేశంలో కాలుష్య పరిస్థితులు రోజు రోజుకు దిగజారుతున్నాయి. ముఖ్యంగా దేశ రాజధాని సహా ఉత్తర భారతంలో కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంటోంది. వరుసగా నాలుగో ఏడాది ప్రపంచంలోనే అత్యంత కాలుష్యమైన రాజధానిగా ఢిల్లీ ప్రథమ స్థానంలో ఉంది. ఇక, గాలి నాణ్యత ప్రమాదకరంగా ఉన్న తొలి 50 నగరాల్లో 35 భారత్లోనే ఉన్నాయి. ప్రపంచ వాయు నాణ్యత నివేదిక-2021ను స్విస్ సంస్థ ఐక్యూఎయిర్ విడుదల చేసింది.2021లో భారత్లోని ఏ నగరమూ.. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన గాలి నాణ్యత ప్రమాణాలు లేవు. 48 శాతం నగరాల్లో డబ్ల్యూహెచ్వో మార్గదర్శకాలు కంటే 10 రెట్లు కాలుష్యం ఉన్నట్లు వెల్లడైంది. ఢిల్లీలో గతేడాదితో పోలిస్తే కాలుష్య స్థాయిలు 15 శాతం పెరిగినట్లు నివేదిక తెలిపింది. ప్రపంచంలోనే తొలి వంద కాలుష్య నగరాల్లో 63 మన దేశంలోనే ఉన్నాయి. అత్యంత కాలుష్య రాజధానుల జాబితాలో ఢిల్లీ తొలి స్థానంలో ఉండగా.. బంగ్లాదేశ్ రాజధాని ఢాకా రెండో స్థానంలో ఉంది. ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాల జాబితాలో రాజస్థాన్ భీవాడి ప్రథమ స్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానంలో ఉత్తరప్రదేశ్లోని ఘాజియాబాద్, ఢిల్లీ నాలుగో స్థానంలో ఉన్నాయి. ఈ జాబితాలో తొలి 15 నగరాల్లో 10 భారత్లోనే ఉన్నాయి. చైనాలోని హోటన్ నగరం?ఈ జాబితాలో మూడో స్థానంలో ఉంది. పాకిస్థాన్లోని ఫైసలాబాద్, బహవల్పూర్, పెషావర్, లాహోర్ కాలుష్య నగరాల జాబితాలో ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.

## క్షయవ్యాధిపై అవగాహనా ర్యాలీ

విశాఖపట్నం వరల్డ్ టీబీ డే సందర్భంగా విశాఖలో అవగాహన ర్యాలీ నిర్వహి స్తున్నట్లు జాయింట్ కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు.టీబీ పరీక్షల కోసం జిల్లాలో 26 వైద్య కేంద్రాలు అందుబా టులో ఉన్నాయని,టీబీ వ్యాది నివార ణపై ప్రజలు అవగాహన పెంచుకోవాల ని సూచించారు.గత ఏడాదిలో 3,892 కేసులు నమోదైతే , ఈ ఏడాదిలో ప్రస్తుతానికి 292 కేసులు నమోదైనట్లు తెలిపారు.జిల్లా వైద్యశాఖ అధికారులు కూడా వ్యాది నివారణ పట్ల పతిష్టమైన చర్యలు చేపడుతున్నారని, వ్యాది సోకిన వారికి ఆర్థిక సాయాన్ని కూడా అందిస్తున్నామని తెలిపారు.రేపు జిల్లా పరిషత్ లో సదస్సును నిర్వహించి వ్యాదినివారణకు తీసుకోవాల్పిన చర్య లపై చర్చిస్తామని తెలిపారు.టీబీ లక్ష ణా లు ఉన్న వాళ్లు విదిగా పరీక్షలు చెయ్యించుకోవాలని జిల్లా వైద్యశాఖ అధికారి విజయలక్ష్మి తెలిపారు. అందుబాటులో ఉన్న పరికరాల ద్వారా గంటల వ్యవదిలోనే వైద్య పరీక్ష ఫలితాల ద్వారా వ్యాది నిర్ధారణ తెలుసుకోవచ్చని తెలిపారు.

## ధాన్యం సేకరణ అంశంపై పీయూష్ గోయల్ను కలిసిన టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు

న్యూఢిల్లీ మార్చ్ 23 ధాన్యం సేకరణ అంశంపై పార్లమెంట్లోని రాజ్యసభ లాబీలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ను కే కేశవరావు నేతృత్వంలో టిఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు కలిశారు. ఈ అంశంపై మీతో చర్చించేందుకు నలుగురు మంత్రులు ఢిల్లీ వచ్చారని గోయల్కు ఎంపీలు వివరించారు. మంత్రులకు, ఎంపీలకు అపాయింట్మెంట్ ఇవ్వాలని గోయల్ను కేశవరావు కోరారు. రేపు షెడ్యూల్ చూసుకుని సమయం ఇచ్చేందుకు పరిశీలిస్తానని పీయూష్ గోయల్ కేకేకు తెలిపారు.వన్ నేషన్?వన్ ప్రొక్యూర్మెంట్ నినాదంతో, పంజాబ్లో మాదిరిగా తెలంగాణలోనూ మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలనే డిమాండ్తో రాష్ట్ర మంత్రుల బృందం మంగళవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్న సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఢిల్లీ వెళ్లిన ఈ బృందంలో నిరంజన్రెడ్డి, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్రెడ్డి, పువ్వాడ అజయ్కుమార్ ఉన్నారు. మంత్రులు, ఎంపీలు ఢిల్లీలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్తో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేయనున్నారు.

# భగత్ సింగ్ .రాజ్ గురు. సుఖదేవ్. ల ఆశయాలతో పోరాడుదాం!

**- ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి జి.రంగన్న**

ఎమ్మిగనూరు మా ప్రతినిధి:- ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదంతో బ్రిటిష్ సామ్రాజ్య వాదాన్ని తరిమికొట్టిన మహా వీరులు కామ్రేడ్ సర్దార్ భగత్ సింగ్ రాజ్ గురు, సుఖ్ దేవ్ ,భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 91 వ వర్ధంతి కార్యక్రమాన్ని ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక సిపిఐ కార్యాలయం దగ్గర ఘనంగ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏ ఐ వై ఎఫ్ తాలూకా కార్యదర్శి బ.ఏసు రాజు అధ్యక్షత వహించడం జరిగింది. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి జి.రంగన్న, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి పంపన్న గౌడ్ పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది.సందర్భంగా మాట్లాడుతూ,స్వతంత్ర పోరాటంలో బ్రిటిష్ వారిని భారతదేశా భూభాగం నుండి నుండి తరిమి వేయడానికి ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదం తో దేశంలో ఉన్న యువత పెద్ద ఎత్తున స్వతంత్ర పోరాటంలో దూకే విధంగా భగత్ సింగ్ ముందుండే వారని కొనియాడారు, భారత దేశంలో ప్రజా ఉద్యమాలను అణచి వేయడం కోసం బ్రిటిష్ పాలకులు పార్లమెంట్లో ఒక నిరంకుశ చట్టాలను తెచ్చిన సందర్భంలో తన అనుచరులతో పార్లమెంట్లో పొగ బాంబులు వేసి, కరపత్రం ద్వారా తన కార్యక్రమాన్ని బ్రిటిష్ ప్రభుత్వానికి తెలియజేసి మహా ధైర్యశాలి భగత్ సింగ్ అని అని అన్నారు. 70 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో యువజన లకు ఉద్యోగాల కల్పించక పరిపాలిస్తున్న ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్న సందర్భంలో, నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని అన్నారు, నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ నీటి మూటగా మారిందన్నారు, ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయడంతో నిరుద్యోగ సమస్య తీవ్రమైంద న్నారు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలన లో 33 ప్రభుత్వ రంగ సంస్థల్లో 3లక్షల పోస్టులు ఖాళీగా ఉంటే పోస్టుల భర్తీ చేయకుండా నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారు, భగత్ సింగ్ స్ఫూర్తితో యువత అంతా భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ చట్టం కోసం పెద్ద ఎత్తున ఉద్యమించాలని అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం విద్యను కాసాయి కరణం ,ప్రయివేటు కరణం చేసి పేద వారికి విద్యను దూరం చేసే ప్రక్రియ నివజూ 2020 ను తీసుకువచ్చి పక్క పగడ్బందీగా ముందుకు పోతున్నారు. ఈ తరుణంలో విద్యార్థులు,విద్యార్థి తల్లితండ్రులు,ఉపాధ్యాయులు అందరూ కూడా భగత్ సింగ్,రాజ్ గురు,సుఖ్ దేవ్ ల స్ఫూర్తి తో ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యన్న, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి బాలరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజేంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజీవ్, ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ నాయకులు ఖాదర్, సమీర్, దస్తగిరి, కేశువ, యవరాజు, రెడ్డి, సోమశేఖర్ పాకెల్గొన్నారు..

# అధికారంలోకి రాగానే పేదల కష్టాలు తీరుస్తాం : కోట్ల



**-వైద్యరంగం పనితీరు లో నాల్గవ స్థానానికి పడిపోయిన ఏపీ సర్కార్**

**-ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన మాజీ కేంద్రమంత్రి కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి**

ఎమ్మిగనూరు మా ప్రతినిధి:- తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే పేదల కష్టాలు తీరుస్తామని, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కి దోపిడి మీద ఉన్న దృష్టి, ప్రజల బాగోగుల పై అసలు లేదని, రాష్ట్రాన్ని పరిపాలించడం లో ఘోరంగా విఫలమయ్యారని మాజీ కేంద్ర మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం టిడిపి నేతలతో కలిసి ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రి యందు టిడిపి హయాంలో మంజూరైన వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పనులను పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ డి బాలయ్య గారిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులలో కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి గారు కలియ తిరిగి రోగులను పలకరించి పరామర్శించారు. ఒకే వార్డులో మహిళలను, పురుషులను కలిపి ఉంచడం పట్ల కోట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళలకు, పురుషులకు వేరు వేరుగా వార్డులు కేటాయించాలని డాక్టర్లకు సూచించారు. ప్రసూతి విభాగంలో మాతృమూర్తులు, పసిపిల్లలు ఫ్యాన్ లు లేక పోవడంతో ఎండవేడికి తాళలేక పేపర్లతో గాలి విచ్చుకుంటున్న పరిస్థితిని చూసిన కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి గారు చలించిపోయారు. ఇందుకు స్పందించిన కోట్ల తక్షణ సాయంగా ప్రభుత్వ ఆసుపత్రికి 20 సీలింగ్ ఫ్యాన్లు అందజేస్తామని డాక్టర్ బాలయ్య కు తెలిపారు. జాలవాడి గ్రామానికి చెందిన వీరేష్ రోగులను ప్రతిదానికి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి ఇక్కడి వైద్యులు పంపుతున్నారని "కోట్ల " దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కోట్ల పాత్రికేయులతో మాట్లాడుతూ... జగన్ సర్కారు లో ఆసుపత్రుల నిర్మాణాలు శంకుస్థాపనల కే పరిమితం అయ్యాయని, వైద్యరంగం పనితీరు లో రాష్ట్ర ప్రభుత్వం నాల్గవ స్థానానికి పడిపోవడం విచారకరమన్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం రెండు నియోజకవర్గాలకు కలిపి ఒకే ఆస్పత్రి ఉండడంతో మెరుగైన సౌకర్యాలు, వసతులు, పరికరాలతో పాటు వైద్యుల కొరత ఉండిన కారణంగా పేద ప్రజలు అల్లాడుతున్నారు అని వీటిని పట్టించుకోకుండా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. 100 పడకల ఆస్పత్రికి 94 మంది సిబ్బంది ఉండాల్సింది పోయి, 47 మంది మాత్రమే ఉన్నారని మిగిలిన 47 పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి 16 మంది డాక్టర్లు ఉండాల్సింది పోయి ఆరు మంది మాత్రమే ఉండడంతో రోగులకు వైద్య సేవలు సకాలంలో ఎలా అందుతాయని ప్రశ్నించారు. ఇక్కడ కుక్క కాటుకు మందు లేదు అంటే ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రి ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రతి చిన్న రోగానికి మెరుగైన చికిత్స పేరుతో కర్నూల్ కి పంపడం వల్ల పేద ప్రజలు ఇబ్బంది పడతారని అవసరమైన వాటికి పంపాలని వైద్యులను కోరారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల కింద నిధులు కేటాయించి ఆపరేషన్ పరికరాలు మంజూరు చేస్తే బాగుంటుందన్నారు. ఈ ఆసుపత్రి యందు బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న డాక్టర్ల కొరత, పరికరాల కొరత, మౌలిక వసతుల కల్పన విషయాలపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని వసతులతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోట్ల వెంట ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బూదూరు లక్ష్మీకాంతరెడ్డి, గోనెగండ్ల మాజీ ఎంపీపీ వేముగోడు కృష్ణారెడ్డి, పరమేశ్వర రెడ్డి, ఆరవీటి సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, మాజీ జిల్లా వక్ఫ్బోర్డు డైరెక్టర్ జి.అల్తాఫ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్లు వెంకటేశ్వర్ రెడ్డి, హరి ప్రసాద్ రెడ్డి, నాయకులు బూదూరు రాఘవేంద్రరెడ్డి ఎన్. సురేష్ కుమార్, పట్టణ తెలుగు మహిళా నాయకురాలు గోకారమ్మ, పట్టణ మైనార్టీ నాయకులు జబ్బార్, గోరా భాష, మహబూబ్ బాషా, పట్టణ ఎస్సీ సెల్ నాయకులు రోజా ఆర్ట్స్ ఉసేని, దర్జీ మోషన్న, ఎమ్మిగనూరు మండలం నాయకులు బనవాసి ఆదినారాయణ రెడ్డి, మాజీ మండల ఆత్మ చైర్మన్ కందనాతి శ్రీనివాసులు, తిమ్మాపురం కురుమన్న, అడ్వకేట్ కె.టి.మల్లికార్జున, మాసుమన్ దొడ్డి శ్రీనివాసులు, కడివెల్ల ఉరుకుంద గౌడ్, కడిమెట్ల సూర్యనారాయణ రెడ్డి, చంద్ర, గుడికల్ నాగరాజు, వెంకటేష్, కే. తిమ్మాపురం గ్రామ నాయకులు బి.జి. చంద్రన్న, సోమప్ప, చిన్న హనుమంతు, వీరేష్, మార్కయ్య, నందవరం మండలం నాయకులు కనకవీడు ఈరన్న, రాయచోటి సుధాకర్ రెడ్డి, మారెప్ప, లోకయ్య, జొహరాపురం సంజీవరెడ్డి.గోనెగండ్ల మండలం నాయకులు అల్వాల సర్పంచ్ డాక్టర్ భాష, గోనెగండ్ల మాజీ సర్పంచ్ రంగముని, నేరడిప్పుల రామాంజనేయులు, పెద్ద మర్రివీడు మల్లేష్, చిన్న మర్రివీడు నాగులు తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో కరాటే శిక్షణ కేంద్రం ప్రారంభం



కర్నూలు , కర్నూలు నగరంలోని స్థానిక సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో డివైఎఫ్ఐ న్యూ సిటీ కార్యదర్శి హుస్సేన్ అధ్యక్షతన కరాటే శిక్షణ కేంద్రాన్ని శేఖర్ గౌస్ కరాటే మాస్టర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సుందరయ్య స్ఫూర్తి కేంద్రం డైరెక్టర్ రాధాకృష్ణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడుతూ భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని పేదలు ఎక్కువ మంది నివసించే ఇంద్రగాంధీ నగర్ పరిసర ప్రాంతాల్లోని బాల బాలికలకు కరాటే శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషించదగ్గ విషయం అని తెలిపారు. భారతదేశ స్వతంత్ర పోరాటంలో ముందు వరసన నిలిచిన యువ విప్లవకారుల అయినా భగత్ సింగ్ రాజగురు సుఖదేవ్ లను 1931 మార్చి 23న బ్రిటిష్ ప్రభుత్వం ఉరి తీసింది. ఆనాడు దేశంలోని ఆర్థిక అసమానతలు లేని విదేశీ పాలన నుండి విముక్తి కావాలని కోరుతూ పోరాడుతున్న భగత్ సింగ్ రాజగురు సుఖదేవ్ చంద్రశేఖర్ ఆజాద్ లు బృందం హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ పేరుతో ఏర్పాటై దేశవ్యాప్తంగా ఉన్న యువతీ యువకులను ముఖ్యంగా యూనివర్సిటీలో విద్యార్థులను స్వతంత్ర పోరాటంలో పాల్గొనే లాగా ఉత్సాహం నింపిన గొప్ప విప్లవకారుల అని కొనియాడారు. నవ్వుతూ ఉరికంబం ఎక్కిన టువంటి భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ్ లు మరణించి 91 సంవత్సరాలు పూర్తయిన ఇంకా వారి స్ఫూర్తి భారత దేశంలోని యువతకు ఆదర్శంగా ఉంది అని తెలిపారు. పేదలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో భగత్సింగ్ స్ఫూర్తితో ఏర్పాటు చేస్తున్న కరాటే శిక్షణ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా స్పోర్ట్స్ కన్వీనర్ శంకర్, కరాటే జూనియర్ మాస్టర్ ఆజాద్, డివైఎఫ్ఐ న్యూ సిటీ అధ్యక్షులు ధనుష్, ఉపాధ్యక్షులు విజయ్ కరాటే నేర్చుకోవడానికి ఆసక్తితో వచ్చిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# 16 లక్షల విలువ గల గంజాయి ధ్వంసం ...

**జిల్లా ఎస్పీ సిహెచ్. సుధీర్ కుమార్ రెడ్డి ఐపియస్ గారు.**

కర్నూలు మార్చి 23 కర్నూలు పోలీసులు బుధవారం భారీగా గంజాయిని ధ్వంసం చేసి నిప్పు అంటించి తగలబెట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిహెచ్. సుధీర్ కుమార్ రెడ్డి ఐపియస్ గారు మీడియా తో మాట్లాడారు. ఈ రోజు కర్నూలు జిల్లా లో వివిధ పోలీసుస్టేషన్ ల పరిధులలో పట్టుబడిన గంజాయిని కర్నూలు నగర సమీపంలోని దిన్నేదేవరపాడు దగ్గర ఉన్న జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ధ్వంసం చేశామన్నారు. గత 5 సంవత్సరాలుగా (2018 నుండి 2022 ఇప్పటి వరకు) జిల్లా వ్యాప్తంగా 104 కేసులకు సంబంధించి 400 కేజీల గంజాయిని ధ్వంసం చేశామన్నారు.10 రోజుల నుండి కార్యచరణ ప్రణాళిక చేపట్టామన్నారు.ప్రతి పోలీసుస్టేషన్ లో , కోర్టులలో పెండింగ్ ఉన్నటువంటి ఈ ప్రాపర్టీ మొత్తాన్ని మెజిస్ట్రేట్ అనుమతితో , ఔఆఖూ ంఇబి ప్రకారం ప్రొసిడింగ్స్ చేసి పంచనామా ప్రకారం గంజాయిని ధ్వంసం చేసి కాల్చి వేయడం జరిగిందన్నారు. దహనం చేసిన గంజాయి విలువ 16 లక్షల రుపాయలు ఉంటుందన్నారు.

# భీమ్లా డైరెక్టర్ తో బడా బ్యానర్లు..?

2012 లో 'అయ్యారే' అనే సినిమాతో డైరెక్టర్ గా టాలీవుడ్ కు పరిచయమైన సాగర్.. నాలుగేళ్ళ తర్వాత 'అప్పట్లో ఒకడుండేవాడు' చిత్రంతో వచ్చాడు. ఈ కంటెంట్ బేస్డ్ సినిమాతో విమర్శకుల ప్రశంసలు అందుకొని అందరి దృష్టిని ఆకర్షించాడు.అయినప్పటికీ దర్శకుడు వెంటనే మరో ప్రాజెక్ట్ ని సెట్స్ మీదకు తీసుకురాలేకపోయారు. ఈ క్రమంలో దాదాపు ఏడేళ్ల తర్వాత టాలీవుడ్ అగ్ర హీరోల్లో ఒకరైన పవన్ కళ్యాణ్ ని డైరెక్ట్ చేసే ఛాన్స్ అందుకున్నాడు సాగర్.త్రివిక్రమ్ శ్రీనివాస్ పర్యవేక్షణలో సాగర్ చంద్ర తెరకెక్కించిన 'భీమ్లా నాయక్' చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ విజయం సాధించింది. పవన్ కళ్యాణ్ ను మునుపెన్నడూ చూడని సరికొత్త పాత్రలో చూపించి ప్రేక్షకులను మెప్పించారు.భీమ్లా ప్రాజెక్ట్ షూటింగ్ స్టార్ట్ అయినప్పటి నుంచి ఈ సినిమా విషయంలో త్రివిక్రమ్ సందడే ఎక్కువ కనిపించినా.. రిలీజ్ తర్వాత డైరెక్టర్ సాగర్ పనితనాన్ని అందరూ గుర్తించారు. పవన్ సినిమా విజయంలో భాగమైన



దర్శకుడికి హీరో ఫ్యాన్స్ నుంచి పెద్ద ఎత్తున ప్రశంసలు దక్కుతున్నాయి.పవన్ కళ్యాణ్ సైతం సాగర్ చంద్ర పనితనాన్ని కొనియాడారు. అమెరికాలో చదువుకుంటూ సినిమా మీద ఫ్యాషన్ తో చిత్ర పరిశ్రమలో బలమైన దర్శకుడిగా రూపుదిద్దుకుంటున్నారని అన్నారు.ఏదైతేనేం సాగర్ కెరీర్ లో 'భీమ్లా నాయక్' వంటి బ్లాక్ బస్టర్ సినిమా వచ్చి చేరింది. ఈ సక్సెస్ తో ఇప్పుడు అతని క్రేజ్ మరో స్థాయికి వెళ్ళింది. దీంతో పెద్ద పెద్ద నిర్మాణ సంస్థలు దర్శకుడితో సినిమాలు చేయడానికి ముందుకు వస్తున్నారు.టాలీవుడ్ స్టార్ ప్రొడక్షన్ హౌసెస్ లో ఒకటైన ఏకే ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో సాగర్ కె చంద్ర ఓ ప్రాజెక్ట్ కు సైన్ చేసారని టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం స్టార్ హీరోలతో సినిమాలు చేస్తున్న ప్రొడ్యూసర్ అనిల్ సుంకర.. సాగర్ దర్శకత్వంలో ఓ పాపులర్ హీరోతో మూవీ ప్లాన్ చేస్తున్నారని అంటున్నారు.అలానే భవ్య క్రియేషన్స్ పతాకంలో సాగర్ ఓ సినిమా కమిట్ అయ్యారట. త్వరలోనే ఈ ప్రాజెక్ట్స్ కు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సమాచారం. సరైన గుర్తింపు కోసం పదేళ్లుగా ఇండస్ట్రీలో కష్టపడుతున్న సాగర్ కె చంద్ర కు.. ఇప్పుడు 'భీమ్లా నాయక్' సక్సెస్ తో వరుస ఆఫర్లు వస్తున్నాయని తెలుస్తోంది.

# చూస్తుంటే నాని రూటు మార్చినట్టున్నాడే!


నాని అనగానే మా పక్కింటి అబ్బాయిలా అనిపిస్తాడు .. మా కాలనీ కుర్రాడిలా కనిపిస్తాడు అని చెబుతుంటారు. నిజమే నాని అంత సహజంగా నటిస్తుంటాడు. కథ ఏదైనా .. పాత్ర ఏదైనా అందులో అతి చూపించడు. ఎక్కడ ఎంత వరకు అవసరమో అంతవరకూ మాత్రమే నటించడమనేది నానీకి బాగా తెలిసిన విద్య. తనకి గల నేచురల్ స్టార్ అనే పేరుకు తగినట్టుగానే తెరపై నాని చాలా సాదాసీదాగా కనిపిస్తూ మంచి మార్కులు కొట్టేస్తూ వచ్చాడు. తన దగ్గరికి వచ్చిన ప్రతి కథను కాకుండా ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్రలను చేస్తూ వచ్చాడు.కథాకథనాలలోని కొత్తదనానికి నాని ప్రాధాన్యతనిచ్చాడు. కానీ ఎప్పుడూ కూడా ఆయన పాత్ర పరంగా పూర్తిగా మారిపోయే లుక్ కోసం ట్రై చేయలేదు. అవసరమైతే కాస్త క్రాఫ్ ను పైకో .. పక్కకో దువ్వడం .. మీసకట్టును వంకీ తిప్పడం .. గెడ్డం తీయడమో .. కాస్త పెంచడమే చేసేవాడు అంతే .అది కూడా అప్పుడప్పుడు మాత్రమే. అలాంటి నాని ఈ మధ్య కాలంలో తన రూటు మార్చినట్టుగా కనిపిస్తున్నాడు. 'శ్యామ్ సింగ రాయ్'లో నాని లుక్ అంతకుముందు ఆయన చేసిన పాత్రలకి పూర్తి భిన్నంగా కనిపిస్తుంది. ఆ సినిమాలో ఆయన లుక్ డీసెంట్ గా .. రాయల్ గా కనిపిస్తుంది.ఒక పాత్ర కోసం నాని తనని తాను పూర్తిగా మార్చుకోవడం ఈ సినిమాతోనే జరిగిందని అనుకోవచ్చు. నాని ప్రయత్నానికి తగినట్టుగానే ఈ సినిమా భారీ విజయాన్ని సాధించింది. ఆయన కెరియర్లో చెప్పుకోదగిన సినిమాల్లో ఇది ఒకటిగా నిలిచింది. ఆ తరువాత 'అంటే .. సుందరానికీ' సంబంధించిన వీడియో .. 'దసరా' సినిమాకి సంబంధించిన పోస్టర్ బయటికి వచ్చిన తరువాత నాని వరుస ప్రయోగాలకు తెరలేపాడనే విషయం అర్థమైంది. 'అంటే .. సుందరానికీ' చాలా ఇంట్రెస్టింగ్ టైటిల్. 'అంటే .. సుందరానికీ' అనే టైటిల్ వెనుక అనేక సందేహాలు కనిపిస్తాయి.ఈ సినిమాలో నాని మీసాలు లేకుండా .. అమాయకంగా కనిపిస్తాడు. ఆచార వ్యవహారాలకు మధ్య నలిగిపోయే యువకుడిగా నవ్వులు పూయిస్తాడు. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించిన ఈ సినిమా కూడా లుక్ పరంగా నానీలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించేదే. ఇక ఆ తరువాత ఆయన శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'దసరా' చేస్తున్నాడు.సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమాలో నాని ఊరమాస్ లుక్ తో




కనిపించనున్నాడు. బహుశా ఇంత మాస్ లుక్ తో ఆయన కనిపించడం ఇదే ఫస్టు టైమ్ అనుకుంటా. కథాకథనాలతో పాటు లుక్ పరంగా తనని తాను మార్చుకుంటూ వెళుతున్న నాని ముమ్మందు ఎలాంటి ఎలాంటి ప్రయోగాలు చేస్తాడో .. ఎలాంటి ఫలితాలు చూస్తాడో!

# ప్రభాస్ డైరెక్టర్ పవన్ ని సర్ ప్రైజ్ చేశాడా?

మూడున్నరేళ్ల విరామం తరువాత మళ్లీ కెమెరా ముందుకొచ్చారు పవర్ స్టార్ పవన్ కల్యాణ్. 'వకీల్ సాబ్' సినిమాతో పవన్ కల్యాణ్ మళ్లీ సినిమాల్లో నటించడం మొదలుపెట్టారు. బాలీవుడ్ సూపర్ హిట్ ఫిల్మ్ 'పింక్' ఆధారంగా తెరకెక్కిన ఈ మూవీ తెలుగులో సంచలన విజయాన్ని సాధించింది. పవన్



ఇమేజ్ కి తగ్గట్టుగా మార్పులు చేసి ఈ మూవీని రీమేక్ చేయడంతో థియేటర్ల వద్ద ఫ్యాన్స్ జాతర కనిపించింది. ఇక ఈ మూవీ తరువాత తాజాగా మరో రీమేక్ ని చేశారు.అదే 'భీమ్లానాయక్'. ఇది కూడా రీమేకే కావడం విశేషం. మలయాళ హిట్ ఫిల్మ్ 'అయ్యప్పనుమ్ కోషియుమ్' ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం ఆశించినట్టే బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీని సృష్టించింది. పవన్ కెరీర్ లో అత్యధిక వసూళ్లని రాబట్టిన చిత్రంగా నిలిచింది. బ్యాక్ టు బ్యాక్ రీమేక్ లు ఫుల్ గా వర్కవుట్ అవుతుండటంతో పవన్ స్టార్ వరుస రీమేక్ లని లైన్ లో పెట్టేస్తూ ఫ్యాన్స్ కి షాకుల మీద షాకులిస్తున్నారు. ఈ మూవీ అందించిన సక్సెస్ జోష్ తో మరో రీమేక్ కు శ్రీకారం చుట్టబోతున్నారు.సముద్రఖని నటించి రూపొందించిన 'వినోదాయ సితం'ని త్వరలోనే పవన్ తో రీమేక్ చేయబోతున్నారని వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో తాజాగా మరో ఆసక్తికరమైన అప్ డేట్ బయటికి వచ్చింది. ఈ రీమేక్ తో పాటు తెలుగులో పెద్దగా ప్రభావం చూపించని 'తేరీ' చిత్రాన్ని పవన్ చేయబోతున్నారని తాజాగా వినిపిస్తోంది. ఈ మూవీని తెలుగులో ఇప్పటికే 'పోలీసోడు' పేరుతో డబ్బింగ్ చేసి విడుదల చేశారు. విజయ్ హీరోగా అట్లీ రూపొందించిన ఈ మూవీని దిల్ రాజు రిలీజ్ చేశారు.తెలుగులో పెద్దగా ప్రభావాన్ని చూపించలేకపోయిన ఈ మూవీని పవన్ తో రీమేక్ చేయబోతున్నారట. ప్రభాస్ తో 'సాహో' చిత్రాన్ని తెరకెక్కించి మంచి పేరు తెచ్చుకున్న సుజీత్ ఈ మూవీని డైరెక్ట్ చేయబోతున్నాడని ఇప్పటికే పవన్ ఇమేజ్ కి తగ్గట్టుగా కథలో మార్పులు చేశారని తను చేసిన మార్పులు పవన్ కల్యాణ్ కు బాగా నచ్చాయని ఈ మూవీని వెంటనే పట్టాలెక్కించాలనే ఆలోచనలో ప్రస్తుతం చిత్ర బృందం వుందని తెలిసింది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన అఫీషియల్ అనౌన్స్ మెంట్ రానుందని చెబుతున్నారు.

# ఐపీఎల్ అభిమానులకు గుడ్‌న్యూస్



ఐపీఎల్ 2022 సీజన్ ఆరంభానికి మూడు రోజుల ముందు క్రికెట్ అభిమానులకు గుడ్‌న్యూస్ చెప్పింది. ఈసారి ఐపీఎల్ మ్యాచ్‌లకు 25 శాతం ప్రేక్షకులకు అనుమతినిస్తూ ఐపీఎల్ తన అధికారిక వెబ్‌సైట్‌లో బుధవారం పేర్కొంది. ఫ్యాన్స్‌కు ఇది సంతోషం కలిగించే విషయం.. ఎందుకుంటే ఐపీఎల్ 15వ సీజన్ ఆరంభ వేడుకలను ఈసారి కూడా నిర్వహించడం లేదని బీసీసీఐ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసి ఫ్యాన్స్‌ను నిరాశ మిగిల్చింది.అయితే ఒక్కరోజు వ్యవధిలోనే ఈసారి మ్యాచ్‌లకు ప్రేక్షకులను అనుమతిస్తున్నట్లు గుడ్‌న్యూస్ చెప్పింది. అయితే పూర్తిస్థాయి ప్రేక్షకులను కాకుండా కేవలం 25 శాతం మందికి మాత్రమే అనుమతి ఇచ్చింది. కాగా కోవిడ్-19 కారణంగా ఈ ఏడాది సీజన్‌ను ముంబై, పూణే వేదికల్లో నిర్వహించనున్నారు. మార్చి 26న గత సీజన్ విజేత సీఎస్‌కే.. రన్నరప్ కేకేఆర్ మధ్య మ్యాచ్‌తో సీజన్ ప్రారంభం కానుంది."ఐపీఎల్ 15వ సీజన్‌కు ప్రేక్షకులను అనుమతిస్తున్నాం. అయితే కోవిడ్-19 నిబంధనల ప్రకారం 25 శాతం మందికే ఎంట్రీ ఇచ్చాం. తమ అభిమాన క్రికెటర్ల ఆటను దగ్గర్నుంచి చూడాలనే అభిమానుల కోరికను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నాం. కాగా ప్రోటోకాల్స్ కచ్చితంగా అమలవుతాయి. "అంటూ ఐపీఎల్ నిర్వాహకులు అధికారిక ప్రకటన చేశారు. కాగా గతేడాది సీజన్‌లో తొలి అంచె పోటీలకు ప్రేక్షకులను అనుమతించిన సంగతి తెలిసిందే. అయితే ఆటగాళ్లకు కరోనా సోకడం.. సిబ్బందిలో కూడా చాలా మందికి పాజిటివ్ అని తేలడంతో ఐపీఎల్ 2021 సీజన్‌ను నిలిపివేశారు. ఆ తర్వాత నవంబర్‌లో మళ్లీ ఐపీఎల్ రెండో అంచె పోటీలను నిర్వహించినప్పటికి ప్రేక్షకులను అనుమతించలేదు.

## అదరగొట్టిన జడేజా.. టెస్టుల్లో మరోసారి నెంబర్‌వన్‌గా

ఐసీసీ టెస్టు ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా మరోసారి నెంబర్‌వన్‌గా నిలిచాడు. 385 పాయింట్లతో జడ్డూ తొలి స్థానంలో ఉండగా.. రెండో స్థానంలో విండీస్ ఆల్‌రౌండర్ జేసన్ హోల్డర్(357 పాయింట్లు) ఉన్నాడు. ఇటీవలే శ్రీలంకతో సిరీస్‌లో విశేషంగా రాణించిన జడేజా మార్చి 9న విడుదల చేసిన ఐసీసీ టెస్టు ఆల్‌రౌండర్స్ విభాగంలో నెంబర్‌వన్‌గా నిలిచాడు. దాదాపు వారం పాటు నెంబర్‌వన్‌గా ఉన్న జడేజా విండీస్ ఆల్‌రౌండర్ హోల్డర్‌కు మరోసారి కోల్పోయాడు.తాజాగా మరోసారి నెంబర్‌వన్‌గా నిలిచిన జడేజా, హోల్డర్‌కు మధ్య దాదాపు 28 పాయింట్ల వ్యత్యాసం ఉండడం విశేషం.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**